


పెద్దకథ:

# అన్నపూర్ణ

★

శ్రీ బలివాడ కాంతారావు

శ్రావణ మంగళవారం. ఆవేళ రాత్రి స్నేహితుని సాగనంపటానికి భోజనాలయ్యాక స్టేషనుకు వెళ్లాడు వీరభద్రరావు. ఇంతలో బుచ్చిబాబు యింటికి చేరుకున్నాడు.

భోజనందగ్గర వదిన మరదిని ప్రశ్నించింది "రేపు వాళ్ళ కేదో కబురు చెప్పాలి—ఏం ఆలోచించారండి బుచ్చి?"

"చెప్పవలసిందేదో యిదివరకే చెప్పాను"

"బాగా ఆలోచించండి. ఊర్లో సంబంధం. కష్టసుఖాలకి కాస్త చేదోడు, వాదోడుగా వుంటారు"

తడుముకోకుండా దృఢమైన గొంతుకతో "నాకిష్టం లేదండీ వదినా" అన్నాడు.

అన్నపూర్ణ మనసు బాధపడినా సర్దుకొని "మీఅన్నయ్యగారికి ఆ సంబంధం చాలా యిష్టంగా ఉంది. మనకు కావలసిన అన్నిహంగులున్నాయ్..." కాసేపు సాలోచనగా ఆగి నెమ్మదిగా "మీరు ఒకింటివారైతే లక్ష్మి పెళ్ళికూడా చెయ్యొచ్చు?..."

లోపల రహస్యాన్ని యీచివరిప్రయత్నంలో వెళ్లగ్రక్కింది. కాని యీమాటలు అన్నాక మరది ముఖంలో యేవగింపు చూస్తూనే వుంది. చప్పున "వాళ్ళముక్కుపిండా?" అన్నాడు బుచ్చిబాబు.

"మన ముక్కుపిండేవాళ్లు లేకపోతే-మనం యింకోళ్ల ముక్కు పిండేవాళ్లమే కాదు...అయినా మీకు తెలియని యేం ఆస్తిపాస్తు లున్నాయ్ అమ్మ చెయ్యటానికి..."

వదిన నెమ్మదిగా ఆడిన యీమాటల్లో సత్యాసత్యాలు వితర్కించే అవసరం లేనట్టే "కాదంటే అలాచదివించేవచ్చు." అన్నాడు.

"పెద్దచదువులు చదివి యేం వుద్యోగం చెయ్యాలి?"

"చెయ్యవలసివస్తే చేస్తుంది. అదిస్వతంత్రంగా బ్రతికితే..." వాక్యం సగంలో ఆగిపోయాడు. గదిలో పొంచి యీమాటలు వింటున్న చెల్లెలు పెద్దనిటూర్పు విడిచింది.

"మనవంశంలో ఆడవాళ్లెవ్వరూ వుద్యోగం చెయ్యలేదు-" ఇంకా వదిన ఏదో అనబోతుంటే అడ్డొచ్చి "వంశమర్యాదను మూసుకుంటే యీ కాలంలో బ్రతకలేమండి వదినా!" అని కొంచం ఆగి మళ్ళీ అన్నాడు "తెలివితేటలున్నప్పుడు చదివించటంలో తప్పేంవుంది?"

మనసులో పాతుకపోయిన ఒక గట్టినమ్మకాన్ని ఛేదించేటప్పుడు పొందే బాధతో వదిన గింజు

కుంటోంది. చివరిమాటలుగా ప్రశ్నించింది. "అయితే ఆశ వదులుకోమంటారా?" అని.

"నే నేదో తెచ్చుకుంటున్నాను నాకు పైవాళ్ళ డబ్బు అక్కర్లేదు."

ఈసమాధానం యిచ్చాక బుచ్చిబాబు లేచి పోయాడు.

ఈవేళ యింత పెద్ద తృణీకారం తట్టుకొనే నిగ్రహం కొంతసేపటికిగాని వచ్చిందికాదు. ఓర్పు కలిగి తొందరపడని మనిషి కాబట్టి "మంచిదండి" అంది.

వీరభద్రరావు వచ్చీ రావటంతో యిదేపనిగా ప్రక్కగదిలోనున్న బుచ్చిబాబుదగ్గరకు వెళ్ళి "రేపు వాళ్ళకు చెప్పొచ్చుగా" అన్నాడు. "వదినతో చెప్పా" నని గొణిగాడు బుచ్చి. రెండుగదులకు మధ్య నున్న గుమ్మానికి రెండువేపుల కాళ్లుచాచి నిలుచుని రెండో గదిలో వున్న భార్యవేపు చూస్తూ "ఏం చెప్పావే" అన్నాడు.

అన్నపూర్ణ జవాబీయలేదు. జవాబు ముఖం లోనే చూపించింది. గదిలో కూర్చుని "బుచ్చీ! ఇలా ఒకసారి రారా" అని శాసించాడు. తమ్ముడు వచ్చి తల దించుకుని నిలుచున్నాడు.

"వాళ్ళకు మాట యిస్తాను"

"అయితే నన్నడగటం దేనికి?" జంకుతూనే అన్నాడు. "అడగక్కరలేకుండా చెయ్యొచ్చన్నమాటేనా?"

ఈప్రశ్నకు జబాబు రాక పోవటంతో భద్రరావు వ్యాకులపడి కూర్చున్నవాడు లేచాడు. అన్నపూర్ణ అలానే పెరటితలుపుకు చారబడి నిలుచుంది.

"ముఖంముడుచుకొనే బదులు, ఏదో ఒకటి అఘోరించు."

"నా కిష్టంలేదు"

కొంచం కటుత్వం యీ సమాధానంలో చొప్పుకు పోవటంతో హఠాత్తుగా "చూడే" అంటూ పెళ్ళాంవేపు తిరిగాడు— "మాటాడితే పెనకేసు కొస్తావ్. బుద్ధీ జ్ఞానం వుండే మాటాడుతున్నాడా?'' కాస్తస్వరస్థాయి హెచ్చించి యీసడింపుతో "వెఱ్ఱి సంస్కారాలతో బుర్ర పాడుచేసుకోకురా! ఇస్తామని ముందు కొస్తుంటే పుచ్చుకోవటంలో యేం తప్పు లేదు."

"తొందరక్కర్లేదు'' అంటూ మొండిగా తేల్చేసి, ముఖం పెడగా త్రిప్పి రెప్పపాటున ప్రక్కగదిలోనికి వెళ్ళిపోయాడు తమ్ముడు.

ఇంతవరకు లొంగివుండేవాడు యిలా సంచ రించటంతో భరించలేని కోపానికి లొంగిపోయాడు భద్రం.

రొప్పుకుంటూ ఆ గదిలోనికి వెళ్ళి ఆవేశపు అథారిటీతో "ఈయింట్లో వున్నంతకాలం నీ యిష్టా యిష్టాలు పనికిరావు. నాకిష్టంగా వుంది చేసుకుతీరాలి"

''చేసుకోను'' కటువుగా అన్నాడు తమ్ముడు

"చేసుకుతీరాలి'' అరిచాడు అన్నయ్య.

తమ్ముని కళ్ళొక్కసారి చింతనిప్పు లయ్యాయి. ఇన్నాళ్లకి వుధృతంగా లేచిన కోపంతో కుర్చీని గప్పున త్రోసి ''చేసుకో నంటే చేసుకోను'' ఊర్ధ్వకంఠంతో అరిచాడు.

అన్నయ్య పళ్లుపటపటా కొరికాడు. త్రోసి వేసిన కుర్చీని కాళ్లతో తన్ని పిచ్చివానిలా అరిచాడు. అన్నపూర్ణ అడ్డువచ్చింది. ఫోవే అంటూ పెళ్లాన్ని ప్రక్కకు నెట్టివేశాడు. ఎనిమిదేళ్లు నిండని కడసారపు చెల్లెలు అరుణ వదినను అన్నయ్య నెట్టి వేయటంతో గట్టిగా యేడ్చేస్తోంది. నాలుగేళ్లపాప తల్లిచీర పట్టుకొని కళ్లు నలుపుకొంటోంది. ఈ యేడుపుకు వుయ్యాలలో యింకో యేడుపు జతయింది. పదహారేళ్ల పెద్ద ఆడబడుచు లక్ష్మి తలుపు చాటునుంచి చూస్తూ విషాద భారంతో అప్పు డప్పుడు కళ్లు చీరకొంగుతో ఒత్తుకుంటోంది.

"నీకూ నాకూ యీ వేళతో సరి. యెక్కడికి పోతావో ఫో" భయంకరంగా వెళ్లగ్రక్కాడు అన్నయ్య.

"పోతాను. నా అవసరం నీకేం-'' చంచలమైన మనసుతో వున్న అన్నపూర్ణ మరదినోరు చటుక్కున మూసివేసి చెయ్యిపట్టుకొని పెరటుకు బలవంతాన తీసుకుపోయింది.

పెనుతుఫాను వుడిగాక యేర్పడ్డ ప్రశాంతత మళ్లే యిల్లంతా మూగపోయినట్లుంది. సగం విరిగిన

చెట్లలా అందరిముఖాలు కాంతివిహీనమై బాధా యుతమై చెత్తగా వున్నయ్.

నిండుయౌవ్వనంలో మల్లెలా మనోహరంగా వికసించవలసిన లక్ష్మిమోము, యెన్నడూ వూహించటానికి కూడా ఆస్కారం లేనటువంటి కలత యీనాడు రేగటంతో, పూర్తిగా వాడిపోయింది. మనసులోవున్న రహస్యాల్ని హృదయంలో దించుకున్న సుఖాంతమైన కోరికల్ని యీకయ్యం విఛ్ఛేదించింది. ఈకలహానికి మూలకారణం తనే అనుకొని మెదడులో చిచ్చు పోసుకుంటోంది.

ఆకస్మాత్తుగా రాజుకున్న యీకలతవల్ల అన్నపూర్ణ చాలరాత్రివరకు రెప్ప వేయలేదు. రేపు తెల్లవారేసరికి యింట్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వుంటుంది. చిరునవ్వుతో యెదురయ్యే మరది కనపడడు. అన్నపూర్ణ యింటిలో "అన్నమేకీరువా" అని వేళాకోళాలాడే బుచ్చిబాబు కనపడడు· పొంఅపళ్లని వేళాకోళాలాడే భర్త అగపడరు. ఇలా అర్థంలేకుండా మారుతుందని ఆమె అనుకున్నా పూర్తిగా నిరాశ జెందలేదు. ఒకరితత్వాన్ని పూర్తిగా తెలుసు. ఇంకొకరిమీద కోపం చూపించో, నాలుగు మాటలు వడ్డించో పరిస్థితి చక్కబరచవచ్చు. ఆధైర్యంతోనే కాస్త మోగన్ను నిద్రజెందింది.

చిట్టి 'కీఁ' మంటుంటే తెలివివచ్చింది. బుజ్జగించి నిద్రపుచ్చింది. భర్త యింకా యేదో చదువుకుంటూండడం గమనించింది. మెల్లగాఆయన పాదాల చేరువులో కూర్చుని

"ఒక మాటంటాను..."

భార్యస్వరం విన్నాక ఆమెవేపు చూశాడు.

"ఈవేళ మనల్ని యిరుగుపొరుగువాళ్లు మనుషుల్లా చూడలేదు..."

"అంతేగా..." పుస్తకంమీద దృష్టి పోనిస్తూనే అన్నాడు.

"అత్తయ్య ఏంచెప్పారో జ్ఞాపకం తెచ్చుకోండి—"

రుక్మిణమ్మ చివరిఘడియలు జ్ఞప్తికి రావటంవల్ల కామోసు అక్షరాలన్నీ అలికినట్లు అగపడ్డాయ్.

కొంతసేపయ్యాక నిశ్శబ్దాన్ని కబళిస్తూ కెమ్మదైన స్వరంమాటలు జారుస్తోంది— "మనపిల్లలు తప్పుచేస్తే యెలా నచ్చచెప్తాం? వాళ్లూ అంతే మనకి—"

భద్రంపెదిమలు కదల్లేదు. వైఖరిలో కూడా అట్టే మార్పు లేదు.

శోకమయమైన కంఠంతో "బుచ్చిని క్షమించరూ?" అన్నది.

"వాడివిషయమే నాతో చెప్పక"

"నేను చెప్పకపోతే యింకెవరు చెప్తారు?"

ఈప్రశ్నకు జబాబు చెప్పటానికి మాటలు దొరకలేదు. తను నిజంఅనుకొని నమ్మిన విషయాన్ని భార్యతో చెప్దా మనుకున్నాడు. కాని కొంతసేపటి వరకూ మాటాడలేదు.

"ఈవేళ జరిగిన దంతా మరచిపోండి"

"వాడి మనస్సులో యేంవుందో ఆలోచించకుండా మాటాడతావే!"

అన్నపూర్ణ నోరుతెరచి భర్తవేపు ఆశ్చర్యంగా చూసింది.

"పెళ్లివద్దనటంలో వాడివుద్దేశం యేమంటావ్?"

"ఉద్దేశం యేవుంటుంది? మనకిగతిలేక కట్నం పుచ్చుకుంటామని బలవంతంచేస్తున్నాం గానీ బుచ్చివుద్దేశం మంచిది కాదంటారా?"

"వాడివుద్దేశం యింకా నువ్వు తెలుసుకోలేదే-కట్నం వూర్లోసంబంధం అని వంకలుపెట్టున్నాడు గానీ."

"మనసు పాడుచేస్తారని భయం వుంటే వుండొచ్చు. అయినా బుచ్చి చేతకానివాడా?"

"అసలుసంగతి అదికాదు. కట్నంరూపంలో వచ్చింది వీడికేం దక్కుతుంది? కట్నం పుచ్చుకోనని ఆ డబ్బంతా వాడే అంకించుకోవాలని..."

"ఛా ఛా..."

"ఛాఛా యేమిటి—ఉన్నవాళ్లు వస్తురూపంలో పిల్లకు ఆ డబ్బు ముట్టచెప్పకుండా వూరుకుంటారా?"

అన్నపూర్ణ లేచి "మీ రెందు కిలా అనుకోవాలి? బుచ్చి మీ మీద యింకోలా అనుకుంటే—మధ్యనున్న ఆడపిల్లల్ని యేడిపిస్తారు—"

"ఎవరైనా యెందు కేడవాలే?"

"ఈయెడముఖాలు పెడముఖాలతో మమ్మల్ని యేడిపించండి"

"మధ్య నువ్వెందు కేడవాలి? నీవు తెచ్చిన మూడు వేలలో మిగిలింది వాడిచదువుక్రింద తగలేశావ్. వాడిచెయ్యి కలిశాక నోరుకట్టుకొని యీ రెండేళ్లలో గడించింది యిలా పెళ్లిక్రింద తగలెయ్. యెవరొద్దన్నారు?'' అంటూనే దీపం తగ్గించి లేచి పోయాడు. పరుపుదగ్గరకు వెళ్లినా అన్నపూర్ణ యింకా అక్కడే కూర్చుంది. రెండుమూడుసార్లు భార్య వేపు చూశాడు. ఆమె అలానే కూర్చుంది. కానీ చీర కొంగుతో కళ్లు ఒత్తుకోవటం చూశాడు.

"చాలా రాత్రయింది. పడుకో" అన్నాడు

అన్నపూర్ణ తలెత్తి చూసింది. ఎదురుగా భర్తను చూసి చప్పున లేచిపోయింది. "మధ్యను నాకెందుకానిష్ఠూరం నీ యిష్టంవచ్చినట్లు కానీ- నే నేవిధంగా అడ్డురాను" అన్నాడు.

ఈమాటలు విన్నాక ఆమెముఖంలో వెలిగిన వెలుగు ఒకవిధంగా ఆయనదగ్గరగా రాటానికి తోడ్పడింది. భర్తవక్షం మీద పరిపూర్ణానందంతో వ్రాలిన ఆమెను అర్థంచేసుకున్నా నన్నట్లుగా ఆయన సంచరించాడు.

నిముషాలు దొర్లుతున్నా యిరువురూ అలా నిల్చుండిపోయారు. ఈ వేళ కయ్యంవల్ల వుత్పత్తి అయిన హాలాహలం తరవాత అమృతమేమో యిది! ఇంతగా తనకు తానై దిగిరావటం యేనాడూ జరగలేదు—దీనికి యింకొక కారణంకూడా లేకపోలేదు. రాత్రిజరిగిన సంఘటనగురించి ఒకవిధంగా సిగ్గుపడాలని తన అంతరాత్మబోధిస్తూనేవుంది.

సన్ననిస్వరం, మెల్లగా తేరుకున్న ఆస్వరంతో "బుచ్చిని మామూలుగా పిలుస్తారుకదూ?"—ఆమె నోరు ఆవిలించివుంది...కళ్లు మూత పడలేదు—చేతులు వదులుదేరాయ్...

"ఊఁ" అన్నాడు భద్రం చివరకి.

నోరు, కళ్లు మూతబడి శక్తికోలదీ భర్తను బంధించింది బాహువులతో...

పరుపుమీద కళ్లు మూతలు పడేముందు "లక్ష్మి పెళ్లివిషయం?'' అన్నాడు.

"ఆపిల్ల అదృష్టం యెలావుందో?''

"అదృష్టానికే విడిచిపెట్టేస్తామా?''

"మా అమ్మవుంటే, అని, ఆపిల్లలు అనుకోకుండావుండటానికి చెయ్యవలసింది చేద్దాం" అన్నది అన్నపూర్ణ.

"అమ్మ యేదో చెప్పిందన్నావ్ ఒకసారి''

"ఆవిషయం మీతో చెప్పఖర్లే దనుకుంటాను"

"ఏం''

"ఎప్పుడో అవసరంవస్తే చెప్తాను''

కనురెప్పలు బరువెక్కటంవల్ల కామోసు యిద్దరూ మూగవోయారు.

## 3

తెల్లవారింది. డాబామీది మంచులోనే రాత్రంతా పడుకున్నాడేమో ముఖం కొంచం నిగారించివుంది. పరుపుతో క్రిందికి దిగుతున్న బుచ్చిబాబు వంటయింటి వసారాలో నిల్చున్న వదిన వేపు చూశాడు. కాని యిదివరలా నవ్వలేకపోయాడు. వదినముఖం చప్పున త్రిప్పివేయటంతో సిగ్గుపడ్డాడు.

వదినమోము గంభీరంగా వుండటంవల్ల పిల్చి యేమైనా మాటలు వడ్డిస్తుందేమో అని అక్కడే యిటూ అటూ పచారు చేశాడు. మరదిముఖం చూడనని ఒట్టు పెట్టుకున్నట్లుగా సంచరించటంతో యేడుస్తున్న చిట్టిని తీసుకొని వదినదగ్గరగా వెళ్లాడు. వదిన అక్కడనుంచి వెళిపోతుంటే "చిట్టిని తీసుకోండి వదినా" అన్నాడు.

వదిన చేతులుచాపింది. అప్పుడైనా చూడలేదు. బుచ్చిబాబు సిగ్గుతో సగం గొంతుకవిప్పి "కోపంమీద యేదో అనేశాను మరచిపొమ్మని చెప్పండి వదినా"

పిల్లాడిని బుజ్జగిస్తూ అన్నపూర్ణ కోపంగానే "నాతో చెప్పటం దేనికి?"

మరది తెల్లని ముఖం నల్లబడిపోయింది.

వదిన మళ్లీ అన్నది "చెప్పవలసినవాళ్లతో చెప్పండి"

కర్తవ్యమూఢినిలా చూస్తూనిలుచుని కొంతసేపటికి జుత్తులోనికి వ్రేళ్లు పోనిస్తూ "అన్నయ్య యెదర పడటానికి సిగ్గుగావుంద"న్నాడు.

"అయితే మరేం? చీర కావాలా?"

ఈప్రశ్న వేశాక యిక నవ్వాపుకోలేక పోయింది. బరువెక్కిపోయిన మనిషి పెద్దనిట్టూర్పుతో తేలికైపోయాడు.

"ఎప్పుడూ లేనిది అలా డాబా యెగరగొట్టే శారేం?"

"ఏంటో అలా వచ్చేసింది- అన్నయ్య నించే"

"ఏమిచేశారేమిటి? పెళ్లిచేస్తే ఒళ్లువంచాలని కామోసు. కుండపట్టేవాళ్లం వున్నాంగా భయం దేనికి బాబూ?"

"అన్నయ్య పైవాళ్ళతో యెందుకు చెప్పాలి?"

బుచ్చిబాబు ముఖం కొంచం గంభీరమైంది.

"ఏం చెప్పారు?"

"అమన్య రెండుసార్లు సినీమాలకీ, ఒకసారి ఆఫీసువాళ్ళతో ఎక్సర్షన్‌కి వెళ్ళి డబ్బు తగలేశానని, యింకా యేవేవో ఆ గోపాలకృష్ణమూర్తిగారితో చెప్పారు. ఆయనేదో బ్రహ్మాండం బ్రద్దలయ్యేటట్లు నలుగురిమధ్య పుట్టుపూర్వోత్తరాలు జ్ఞాపకానికి తెస్తూ బుద్ధులు చెప్పుకొచ్చారు. ఏం! అన్నయ్య మనసులో యేమైనా వుంటే మీతో చెప్పకూడ దండీ! మీకంటే బుద్ధులు చెప్పేవాళ్లిం కెవరున్నారు? ఆకోపం యీకోపం అంతా-"

రాత్రి గలాటా జరగటానికి కారకురాలని తనే అనుకొని యేమీ మాటాడలేకపోయింది.

భర్త ఆమెతోనూ యీవిషయం చెప్పారు. భర్తను వారించిందిగానీ మరదితో ఆమాటలు చెప్పలేదు. లక్ష్మి అంతలో అక్కడ నిలుచోవటం చూసి బుచ్చిబాబు పళ్లుదోముపుల్లకోసం వెళ్లాడు.

కాఫీ గదిలోనికి తెస్తూ ప్రక్కగదిలోనున్న మరదిని కేక వేసింది. బుచ్చిబాబు వచ్చాడు. అన్నదమ్ము లిద్దరూ ఒకగదిలోనే వున్నారు. అన్నపూర్ణ పెరటితలుపుకు చారబడి చిన్ననవ్వుతో అంది "మీతమ్ముడుగారు క్షమించమంటున్నారని"

ఈమాటలు విననట్టే కాఫీ సేవిస్తున్నాడు వీరభద్రుడు.

వెనుకకుతిరిగి లక్ష్మి వేపు చూస్తూ "కాస్త పొయిదగ్గర కూర్చో అమ్మా- ఈ తగువు తీర్చి వస్తాను"

"నీలా దాని చెయ్యి కాల్చుకోనియ్" అన్నాడు భద్రం.

"కుండపట్టే టప్పుడు చుట్టుకుదురుమీద మట్టి కుండలా కూర్చుంటే యెలా వౌతుంది! చెయ్యికాలినా అనుభవించాలి"

"ఓహో బలేయిల్లాలు దొరికిందే—ఒరేయ్ బుచ్చీ- మరేం-" కొంచం ఆగి "కానీ మరదలు పిల్ల మహాఘటికురాలని విన్నాను"

"మా చెల్లెలు మీ మొఖాసాలేం దోచుకపోదు లెండి?"

"దోచుకుంటే వూరుకోనే వాళ్లెవరే?"

'ఆ ఊరుకుంటారా- కుర్చీలు విరగదోసుకుంటారు- దొమ్మరివాళ్లలా అరుస్తారు- మొఖాలు ముడుచుకుంటారు- అంతేనా? మరేం చేస్తారు?"

"వదిన వచ్చి నోరుమూస్తారు- ఎంతో కోపంగా వున్నట్లు నటిస్తారు"

"అదేమిటిరా అటు వేపు తిరిగావ్"

"మనం యేమిటో గొప్పవాళ్ల మనుకుంటాం గానీ వాళ్ళతరవాతే మనం అన్నయ్యా"

కలతలెలా వచ్చినయ్యో కలియికకూడ అంత వేగంగా జరగటంలో అన్నపూర్ణ సంతోషగర్వంతో ఫక్కున నవ్వింది.

"ఎందుకు నవ్వుతావ్? పాఱ పళ్లు కనిపిస్తున్నయ్" చివర అక్షరాలింకా భద్రంనోటిలోనే వున్నయ్. పెరటినుంచి ఒకసన్నని స్వరం "అన్నయ్య పళ్ళకంటే చిన్నవే" అంది. లక్ష్మి మాటలు విని నిర్విణ్ణుడైనా మళ్లీ సర్దుకొని "సరి! ఈయింట్లో నేనొక్కడినే ఒకటి"

"నన్ను వెక్కిరించినంతకాలం అంతే"

"ఏమైనా మా నేరం లేదు"

అన్నపూర్ణ వంటయింటివేపు ఖాలీ గ్లాసులు పట్టుకుపోతూ "వాళ్లూ మా నేరం లేదు" అంది

"పోనీ నువ్వు వెక్కిరించలేవుగా"

జవాబులేదు. కాని అన్నదమ్ము లిద్దరూ ముఖాలు చూసుకున్నారు.

II

## ౪

కార్తీకమాసంలో బుచ్చిబాబు పెళ్లయింది ఈ పెళ్లిలో ఒక ప్రత్యేకత వుంది. జరగవలసిన తంతులు జరిగినా పెళ్లిపీటలమీద తగు వయింది. పెళ్లికొడుకు పీటమీదనుంచి లేచిపోతుంటే వదిన బలవంతంచేసి కూర్చోబెట్టింది. బుచ్చిబాబు వైఖరికి నవ్వినవాళ్లు, స్తుతించేవాళ్లు కూడా లేకపోలేదు. మాటఆడకుండా నోరుకట్టుకుని కూర్చున్నవాడు భద్రం ఒక్కడే. ఆలోచించవోయ్ అన్నాడు గోపాల కృష్ణమూర్తి పెళ్లికొడుకుతో.

"వివాహోద్దాకేమీ భంగంరాదు. అంత హెచ్చుగా వుంటే దానంచేసుకోండి". ఈ చివరి మాటలు గంభీరంగా రావటంతో ఒక్కసారి పరిస్థితి అదుపులోనికి వచ్చింది.

పద్మజ అప్పుడే రెండుసార్లు అత్తవారింటికి రావటం, వెళ్లటం జరిగింది.

మూడోసారి అత్తవారింటికివచ్చేటప్పుడు మాటాడితే విసుక్కోవటం, ఎప్పుడూ చిన్నముఖం చేసుకొని ఒకదగ్గర కూర్చోవటం చేస్తుంటేది.

ఆదివారమని బద్ధకం విరుచుకొని ధీమాగా లేచేసరికి పద్మజ సిల్కుచీరతో అగపడింది. అప్పుడే యేదో అనుమానం ఆవహించినా స్నానం, కాఫీ అయ్యాక కుర్చీమీద కూర్చుని "చాలాఅందగా కనిపిస్తున్నావే" అన్నాడు నవ్వుతూ.

దగ్గరగానే వున్న వదిన "ఇదెక్కడిహాస్యం అమ్మా" అంటూ ముఖం ప్రక్కకు త్రిప్పింది.

"మర్యాదయిస్తున్నానండీ— గాజుబొమ్మలా యెంత అందగా—ఆబొమ్మలా జాగ్రత్తగా చూడాలి యిలాంటి......"

పద్మజ చరచరా గదిలోనికి వెళ్ళిపోయింది. అప్పుడే భద్రం బొగ్గులబస్తా పెరటవేయిస్తూ "యీ వేళకి నువ్వే బజారుకు వెళ్లిరా" అన్నాడు. తమ్ముడు లేచి బట్టలువేసుకొని వంటయింటి దగ్గరకు వెళ్లాడు. లక్ష్మి వంటయింట్లో వుంది. వదిన యేదో పని పురమాయిస్తోంది.

"ఇదేమిటండీ... పెళ్లిముందు అన్నికబుర్లాడి తీరా లక్ష్మిని పాగమధ్యను కూర్చోబెట్టారు" అన్నాడు నవ్వుతూ ఉద్దేశాన్నిగ్రహించినా ఆ విషయం ప్రస్తావించకండా.

"వేగంగా మీరు రావాలి?"

"ఎన్ని వీసెల బంగాళాదుంపలు?"

"ఎన్ని వీశెలెందుకూ? ఒక అరవీసె చాలు"

"సరి మా అత్తారింట్లో రోజూ బంగాళాదుంపల కూర వుండితీరాలి"

ఈ మాటలు భార్యకు వినిపించినట్లనాన్న డేమో బజారుకు వెళ్లేముందు ఒకసారి గదిలోనికి వెళ్లాడు. పద్మజముఖం పెడగా త్రిప్పివేసింది. కాస్త నవ్విద్దామని చేతిని నడుము దగ్గరకు చేర్చేసరికి ఒకగొంతుని విని త్రుళ్లిపడ్డాడు. ముఖకళ మార్చడానికి పద్మజ ప్రయత్నించవలసివచ్చింది. బుచ్చిబాబు పెదాలొకసారి చప్పరించుకున్నాడు.

పద్మజ అన్నయ్యను కుర్చీమీదకూర్చోబెట్టింది. శ్యామలరావు మూడొంతులు యింగ్లీషున్న తెలుగును యేకధాటిగా గౌరవమైన భాషగా చెల్లగొట్టున్నాడు.

బుచ్చిబాబు బావదగ్గరగా వెళ్లి వంగాడు. తలనుంచి సువాసన కొట్టింది. "బావగారూ! ఎనిమిది దాటినట్టుందే" అన్నాడు. కోటు ఒకసారి సవరించి వాచీ చూసి "జష్టు యిప్పుడే యెనిమిదయిం దన్నాడు.

"బజారు పనివుంది."

"సర్వెంట్ లేడూ"

"అంతా మేమే- వస్తాను" అంటూ చిన్న వానజల్లులోనే వెళ్ళాడు!

అన్నచెల్లెళ్లు మాటాడుకుంటుంటే అన్నపూర్ణ వచ్చి బయటగుమ్మానికి చారబడి నిలుచుని,

"ఏం తమ్ముడూ! అమ్మా అంతా కులాసాగా వున్నారా!"

"హాఁ రేపు వచ్చి మా సిస్టర్ని తీసుక వెళ్తుందేమో!"

"వచ్చి రెండునెలలైనా కాలేదు"

"మా సిస్టర్ హెల్త్ యేమీ బాగా లేదు."

అన్నపూర్ణ వూరుకుంటే వెనుకనుంచి లక్ష్మి

పాడుస్తూ మెల్లగా వూదుతోంది "బాగానే వుందను వదినా — మేం పంపించ మను"

అన్నపూర్ణ అప్పటికీ మాటాడలేకపోయింది. బుచ్చిబాబు "పావుపీసే తెచ్చానండి వదినా" అంటూ గొడవచేసు కొచ్చాడు. సంచి అందుకొని చూసింది. వంకాయలు కూడా వున్నయ్. మిగతా డబ్బులు కానితోసహా లెక్క చెప్పి వదినచేతిలో పెట్టుం డటం అన్న చెల్లెళ్లిద్దరూ చూశారు.

సిగరెట్ ముట్టిస్తున్న బావగారికి కాస్త దూరంగా ఒక ట్రంకుపెట్టెమీద కూర్చుని "చదువు లెలావున్నాయండి" అన్నాడు. 'ఆఁ' అని గొణిగాడు బావ. ఈవైఖరి కొంతవరకు అర్థం చేసుకున్న బుచ్చి బాబు మరికాస్త విజృంభించాడు.

"ఈమధ్య ఏఏ పిక్చర్సు చూశారు?"

"ఏవో మీకు నచ్చనివి"

"బి. ఎన్. సి, లో నా లాగే ఫస్టుక్లాసు వస్తుం దని మీ సిస్టరు అంటోంది. మీలాంటివారికి రాక పోవడ మేంటి?"

జవాబులేదు.

"ఈమధ్య లవంగాల ధరలు పెరిగాయన్నారు?"

ఈప్రశ్న వేసి పద్మజముఖం వేపు చూశాడు. కుపితుడై శ్యామలరావు లేచి వెళ్లిపోయాడు. అన్న పూర్ణ, తమ్ముడూ, అని పిల్చినా లాభంలేకపోయింది.

గదిలో పద్మజ, బుచ్చిబాబే వున్నారు. చాల సేపటివరకు ఒకరిముఖం ఒకరు చూసుకోలేదు. శుష్క హాసంచేస్తూ "మీఅన్నయ్య చాలా తెలివైన వాడు" అన్నాడు. పద్మజకు ముళ్లు గుచ్చు కున్నట్లయింది.

లేచి యిటూ అటూ పచారు చేస్తూ కొంచం కళ్లల్లో నీరుతెచ్చుకున్న భార్యను చూశాడు. కిటికీ దగ్గర ఆగి, గజాలు పట్టుకొని మేఘావృతమైన ఆకాశం వేపు చూస్తూ మెల్లిగా మాటలు తొణికేస్తున్నాడు. "ఇలా కన్నవారికి అన్నీ చెప్పకోవటం వల్ల యెప్పుడో ఒకనాడు విచారిస్తావు—నువ్వెన్నో ఆశలు పెట్టు కున్నావ్—కానీ నేను ఆరోజున యేం చెప్పానో యిప్పటికీ ఆ మాటలే చెప్తాను—మా అన్నయ్యకు వదినకు శాసించటానికి హక్కుంది—శిరసా వహించటం నావిధి"

ఉపదేశంలా యీమాటలు అన్నాక భార్య వేపు చూడలేదు. ఇంతలోనే వేగంగా తేలిపోయా నని కాస్త సిగ్గుపడ్డాడు. భార్య తనవిషయమై ఒకవిధమైన లోకువను మనసులో సృష్టించుకో టానికి ప్రయత్నిస్తుందని "ఆకాశం మీద యెంతదో" అన్నాడు అభినయంతో,

పద్మజ కదల్లేదు మెదల్లేదు.

"చూశావా! చూడు"

ఈసారి లేచింది. కానీ వడిగా నడవలేదు. కిటికీగుండా చూసింది పెదాలువిరచి మళ్ళీ కూర్చుంది.

"గులాబి పువ్వను చూడలేదూ?"

జబాబులేదు.

"ఆకాశంమీద హరివిల్లైనా పొడుస్తుంది. కానీ —ఉష్—అదేమిటో నీ ముఖంలో నవ్వంటూ చూడలేదు" తరవాత ఇద్దరూ యేదో ఆలోచిస్తూనే కూర్చుండిపోయారు.

✂

మరుచటిరోజు తహశీల్దారుగారు భార్యను పంపించారు. నిలుచున్నపాటునే కూతుర్ని పంపెయ్య మని కూర్చుంది. అన్నపూర్ణ చివరకు "మగవాళ్లు వచ్చేవరకైనా వుండండి పిన్నీ" అని బ్రతిమాలింది. "నాకు పనుంది. సాయంత్రం ఆయనే వస్తారు" అని భోజనానికి వుండమని బ్రతిమాలినా వుండకుండా వెళ్లిపోయింది.

ఆవిడ వెళ్ళాక "పంపటానికి వీల్లేదని చెప్పలేక పోయావా వదినా—వాళ్లిష్టమా మనిష్టమా— మంచిగా పోదా మంటే మరీ యిదిగా వుంది"

అన్నపూర్ణ "తొందరపడి నోరు జారేసుకో కమ్మా" అని లక్ష్మిని వారించింది.

పిల్లాడికి పాలుపెట్టూ పద్మజతో "ఒక్కర్తె నని మాఅమ్మ నాకేం వచ్చినా నెత్తీనోరు మొత్తు కుంటుంది. అయినా అత్తవారింట్లో పడ్డకష్టాలు చెప్పకొని పరువు కొల్పుకుంటామా—కలిగిన సంసా రాలా కష్టపడకుండా బ్రతకడానికి—ఏ యెండ కాగా డుగు బట్టి బ్రతుకొస్తున్నాం— ఈయేడు దాటితే యీడబ్బురొక్కటం తీరుతుంది. బుచ్చిబాబు త్రయి

నింగయిపోయి రెండువందల దాకా తెచ్చుకుంటారు కాబట్టి యీయిబ్బందులన్నీ తీరుతాయి"

ఇంతవరకు నిమ్మళ్లంగా తోటికోడలుతో చెప్తుం దేకానీ తనకు కాదన్నట్లుగా పద్మజ మెసలింది.

సాయంత్రం అయింది. ఉదయం వెళ్లిన బుచ్చిబాబు ముందుగా వచ్చాడు. ఒళ్లంతా జిడ్డుగా వుండటంవల్ల స్నానానికని పెరటినూతిదగ్గరకు వెళ్లాడు. భద్రం యింకా రాలేదు. తహశీల్దారుగారు వచ్చారు. "వచ్చే వేళయింది కూర్చోండి బాబాయ్" అంటూ కుర్చీమీద కూర్చోబెట్టి కాఫీ తీసుకు రావటానికి వెళ్లింది. తండ్రీ, కూతురు మాటాడుకుంటుంటే భద్రం వచ్చి గదిబయట నిల్చొనే నమస్కరించాడు. బయటకు వస్తూ "ఒకసారి అమ్మాయిని పంపించండి. వారంపదిరోజుల్లో దిగబెట్తాను" అన్నారు.

ఇంట్లో యిద్దరికి తప్పించి అందరికీ యీ కోరిక సమంజసమే అనిపించింది. పద్మజ వెళ్లాక బుచ్చిబాబు వంటయింటిదగ్గరకు "ఏం కూరండి వదినా" అంటూ వచ్చాడు.

"ప్రొద్దున్న తెచ్చిన వంకాయ వేపుడు—అవునుగానీ ఇంతకంటె మంచివి బజారులో లేవండీ బుచ్చీ?"

"మీబాబాయి లాంటి వాడెవడో మంచి మాటలాడి అంటగట్టాడు. అయినా రేపు వూరుకుంటానా?"

"ఏం చేస్తారు?"

"ముక్కపిండి మరీ వసూలు చేస్తాను"

"మీ పుణ్యం వుంటుంది. కయ్యం తెచ్చుకోగలరు?"

"అబ్బా! ఏమండీ మహాపిరికి" అంటూనే బుచ్చిబాబు నవ్వాడు. చెల్లెలు అరుణతోసహా అందరి ముఖాలు వెలిగాయి.

వారం, రెండువారాలు, మూడువారాలు కూడా దాటాయి. పద్మజను దిగబెట్టలేదు. ఆనోటా యీనోటా పడి భద్రంవరకూ వచ్చిన నిందలవల్ల అన్నపూర్ణను గడపదాటనీయలేదు.

ఆదివారం అన్నదమ్ములిద్దరూ కాఫీత్రాగుతుండగా "అవునండీ బుచ్చీ—మాతమ్ముడితో అలా పౌడర్లూ, స్నోలనీ వేళాకోళం ఆడారు. వాళ్లేమనుకుంటున్నారు?" అంది అన్నపూర్ణ—

"పైలోకంనించి దిగివచ్చినట్టు మాటాడతాడు. కోతలుకోసేవాళ్లదగ్గర కొయ్యాలిగానీ. అవునుగానీ—ఒకరోజుకు పౌడరు లేదని ఆడవాళ్లు గింజుకు చచ్చిపోవాలా?"

తమ్ముడు మాటలకు చప్పున అన్నయ్య "దానికేం తెలుస్తుందిరా? పందెం వేస్తాను. ఒక పౌడరు పేరు చెప్పమనూ?"

"ఈ హాస్యాల మాటకేం గానీ—ఈవేళైనా ఒకసారి నన్ను వెళ్లనీయండి. మాచెల్లెమ్మ ఒంట్లో బాగు లేదని విన్నాను."

"ఏముఖం పెట్టుకొని వెళ్తావ్? కబురూ కాకరకాయ లేంది?" యీసడించాడు భద్రం.

"ఇద్దరూ యిలాంటి పట్టింపులు పెట్టుకుంటే యెలా? సాయంత్రం ఒకసారి వెళ్తాను."

"వారం రోజుల్లో దిగబెట్తానన్న పెద్దమనిషి యేం చేశాడు? వెళ్లు—వాళ్ళకాళ్లు పట్టుకో రొమ్ము రోడ్డాన్నారు?"

"వాళ్ళనంటే యేంలాభం? తప్పంతా మనలో పెట్టుకొని" బుచ్చిబాబు అంటూనే లేచిపోయాడు.

అన్నపూర్ణ కొంచం నిష్ఠూరమైన స్వరంతో "నిజమే తప్పు మనదే—పిలవటానికి వెళ్లామా?"

"ఎలాగో మీరంతా చావండి. నాకెందుకు?" భద్రం కోపంతో మూలిగాడు.

ఈ మూలుగుతో మళ్ళీ గదిలోనికి బుచ్చిబాబు వచ్చి "వాళ్ళకి తగ్గట్టే మనం ఉండాలి. పంపించక పోతే నష్టం యెవరికి?"

"పోనీయండి బుచ్చీ! తగూల్తో మరింత పరువు పోతుంది. మనకూ ఆడపిల్ల లున్నారు. అభిమానాన్ని కాల్చేయటమెందుకు? మన లక్ష్మిలాంటి పిల్ల. ఏడిపిస్తే మనకేం శ్రేయస్సుకాదు. సాయంత్రం వెళ్దాం."

"మంచినీళ్లైనా యిస్తారా?" అన్నాడు భద్రం, "ఇచ్చినా యివ్వకపోయినా మనం వెళ్లినపని అయితే చాలు."

"అలాగనే పెళ్ళిలో అన్నిటికీ తలకంచావ్. పడు, యెవరొద్దాన్నారు?"

"సంబంధాలు చేసుకొన్నాక యెవరివల్లో ఒకరి వల్ల లోటుపాట్లుంటాయ్. ఎవరో ఒకరు సర్దుకోక పోతే యెలా?"

"నే రాను" అంటూ మొండిగా తేల్చేసి బుచ్చిబాబు బయటకు వెళ్లిపోయాడు.

"మీరైనా రండి" అని అన్నపూర్ణ బ్రతిమాలింది భర్తను. ససేమిరా రానన్నాడు. అప్పుడు నెమ్మదిగా ముందుకు రాగల విషయాలు నచ్చచెప్పింది. "చూడండి వాళ్లిద్దరూ హాయిగా వున్నట్లు చూడాలి. ఇద్దరిమధ్యా యేవో కలత లున్నాయి. పెద్దవాళ్లం మనం కలపాలిగానీ విడదీస్తే పాపం! అదికాక పోయినా మరికొన్నాళ్లకి బుచ్చి యే వేషాలు వేసినా మనం తలయెత్తుక తిరగ్గలమా? ఈ వేళ మనం వెళ్ళి బుచ్చి నొకసారి శేపు పంపిద్దాం."

ఇలా కొంతసేపు నచ్చచెప్పాక భద్రం "సరే" నన్నాడు.

ఆ వేళ సాయంత్రం తహశీల్దారుగారింటికి వెళ్లి వచ్చాక భద్రం నోరు చాలసేపటివరకు అద్దూ ఆపూ లేకుండా పెగిలింది. నిజానికి క్రొత్త కోడలిని పూజిస్తున్నామని వీరనుకుంటుంటే వాళ్లు దానికి యెదురుగా ఆరోపించారు. ఆమెను సంతోషపెట్టడానికి తనింకేమి చెయ్యాలో అన్నపూర్ణకు అంతు పట్టలేదు.

బుచ్చిబాబు అన్నయ్యమాటలంతా విని చివరకు "ఇందులో ఒక్కమాటైనా వాళ్ళెదురుగా అన్నారా వదినా?" అన్నాడు.

ఈ సూటిప్రశ్నతో పరిస్థితి కొంత విషమించింది: కోపంతో తబ్బిబ్బవుతున్న అన్నయ్యవేపు చూడకుండా "వాళ్ళ నెందుకనాలి?" అన్నాడు.

పెద్ద యీ సడింపుతో అన్నయ్య లేచేసరికి అన్నపూర్ణ మోము భయావృతమైంది.

ఇంతలో పాప 'కీ' మంటూ గొంతులేసుకుంటూ చెయ్యి దులుపుతూ గగ్గోలుపెట్టుకుంటూ వచ్చింది. భద్రం గప్పున వ్రేలిని నొక్కిపట్టి "ఎక్కడ చెయ్యి పెట్టావమ్మా" అంటూనే భార్యవేపు తిరిగి "వేగంగా వుల్లిపాయ నూరు" అన్నాడు. తీరా చూశాక వంటయింటి అలమారులో పంచదార డబ్బాచాటున యింకా తేలు నక్కివుంది.

మరుచటిరోజు ఆఫీసుకు వెళ్లేముందు వదిన, ఒకసారి అత్తనారింటికి వెళ్ళమని నచ్చచెప్పింది. సాయంత్రం అలా చూసుకొనివస్తానన్నాడు.

సాయంత్రం వచ్చినవెంటనే "వెళ్లారాండి బుచ్చీ" అన్నది. వెళ్ళానన్నాడు క్లుప్తంగా. కానీ విషయాలేమీ చెప్పలేదు. కొంతసేపయ్యాక "మనుషులని చూసి మరీ మసలాలండీ!"

ఎందుకిలా మరది అంటున్నాడో ఆమెకు అవగాహన కాలేదు.

"సంబంధం చేశారుగాని సంగతులు తెలుసుకున్నారు కాదు."

అన్నపూర్ణ మళ్ళీ మొగం వేలవేసింది. "ఉన్నా, లేకపోయినా నీ వెంతో నేనూ అంతే అని పట్టువదలకుండా వుంటే యెవరికోసం లొంగుతారు? చిత్తం బత్తెం అనుకుని కూర్చుంటే లోకువచెయ్యరూ మరి!"

"నోరుగాని చేసుకోలేదు కదా?"

"అంతలో కొట్టేసుకుంటామా? తిట్టేసుకుంటామా? నిలదీసి అడిగితే ఒంట్లో బాగున్నాక తప్పకుండా దిగబెట్తామన్నారు."

అన్నపూర్ణ పెద్దనిట్టూర్పు విడిచింది. "రోజూ అలా త్రోవేకదా! ఒకసారి చూసి మరీ రండి" అంది.

బుచ్చిబాబు నవ్వాడుగాని యింకేమీ అనలేదు. కానీ ఆ వేళ అన్నయ్య చేయవలసినపని తను చేసినందుకు చాలాసేపు కంగారుపడ్డాడు.

౬

నెల దాటింది. వచ్చేవారంలో పద్మజ వస్తుందనగానే భద్రం "మీఅమ్మకు కొంచం జ్వరంకాస్తోందిట వెళ్తావా?" అని అడిగాడు. అన్నపూర్ణ వెంటనే వెళ్లనని చెప్పలేకపోయింది. ఆవారంలోనే భార్యతో అన్నాడు "అల్లుడుమామలు కలిసి తిరుగుతున్నారే"

"మీలా వుండమంటారా? మనకి కావలసిందేమిటి? వాళ్లకీ, మనకూ యెటువంటి అరమరికలు లేకుండా వుండాలనేగా"

పాడినవ్వునవ్వి వెళ్లిపోయాడు. ఎల్లుండి పద్మజ వస్తుందనగా రాత్రి యెనిమిదిదాటినా ఆవేళ రాలేదు. బుచ్చి మొదటిఆట సినీమాకు వెళ్లిపోయాడు. కళ్లుకాయలు కాసేటట్లు యెదురుచూసుకొని కూర్చుంది. తొమ్మిదిదగ్గరైంది. వచ్చాడు. ఆలస్యానికికారణం అడిగితే ప్రయాణం కమ్మన్నాడు.

బుచ్చిబాబు సినీమానించి వచ్చేసరికి వదిన కళ్లలో నీరు కారుతోంది. తరవాత భోంచేస్తానని స్టేషనుకు వెళ్లాడు. రైలులో కూర్చొని తల్లి కెలా వుందనే బెంగను దిగమ్రింగి మరదికి యెల్లుండి పద్మజ వచ్చాక జాగ్రత్తగా తను వచ్చేవరకు త్రిప్పకోమంది. గోపాలకృష్ణమూర్తి స్టేషనుకురావటంవల్ల భద్రం ప్లాటుఫారంచివర యేదో మాట్లాడుతున్నాడు. రైలు కదిలేసరికి భద్రం వచ్చాడు. తమ్ముడు పెట్టినుంచి దిగిపోయాడు.

భార్యాపిల్లలను కన్నవారింట్లో విడిచిపెట్టి వచ్చిన వారంరోజులనాడు ఇంట్లో సామానులు చాలవరకు పాక్ చేయిస్తున్నాడు. ఆవేళనే "ఎలమంచిలి బదిలీఅయిందని" తమ్మునితో చెప్పాడు. అకస్మాత్తుగా యిలా రావటంతో బుచ్చిబాబు యేవేవో ప్రశ్నలు వేశాడు. ప్రయత్నిద్దామన్నాడు. అన్నయ్య "లాభంలేదు. నయం చింతపల్లి యేజన్సీకి వెయ్యకుండా రక్షించారు" అన్నాడు.

వెళ్లిపోయేముందు 'వుత్తరంవ్రాయి అన్నయ్యా' అన్నాడు. అలాగే అన్నాడు అన్నయ్య. ఒక్కొక్కసారి అదోక విధమైన నవ్వును బుచ్చి గమనించకపోలేదు. దానికికారణం యేమా అని ఆలోచించినా యేమీ పాలుపోకుండా వుంది. లక్ష్మి, అరుణల విషయము యేమైనా చెప్తాడంటే యేమీ లేదు.

రైలు యెక్కేముందు చెప్పాడు. "మీవదినను అలాగే తీసుకువెళ్తాను. నువ్వేమీ అనుకోవద్దు" అన్నాడు. ఈ చివరివాక్యం అతనిజీవితంలో తొలిసారిగా అన్నయ్యనోటివెంబడి వినటంతో బుచ్చి నిర్విణ్ణుడయ్యాడు.

"వదిన కొన్నాళ్లిక్కడవుంటే" అన్నాడు.

"నాకక్కడ హోటల్లో కష్టంగా వుంటుందిరా" అన్నాడు.

రైలు కదులుతుంటే తమ్ముడు శిలాప్రతిమలా నిలుచుండిపోయాడు. వాళ్ళ జీవితాలలో విడిపోయి వుండటం యిదే తొలిసారి. అన్నయ్య వెనుకకు తిరిగి కిటికీగుండా వాల్తేరుప్లాటుఫారంవేపు చూసినా మళ్ళీ వెంటనే తల త్రిప్పాడు. అంతవరకు ఆపుకున్న కోపం ఆవులింతలతో గాలిలో కలసిపోయింది. తమ్ముడు తలవంచుకొని మెల్లగా అడుగులు చూసుకుంటూ వచ్చాడు.

అచ్యుత రామయ్యగారుగానీ, అన్నపూర్ణగానీ యెటువంటి అనుమానానికిగానీ పాల్పడకుండా సంచరించటానికి బహువిధంగా కృషిచేశాడు.

అన్నపూర్ణకు యెలమంచిలి రాగానే యిల్లు ఒంటిగా వుండటం యేమీ నచ్చలేదు. ఇరుగుపొరుగులేని యిళ్ళల్లో వుండటమంటే ఆమెకు గిట్టదు. కాని యిళ్ళకరువు. ఎలాగో వుండక తప్పిందికాదు. తను అడక్కముందే భర్త అన్నీ చెప్తున్నారు. తమ్ముని మీద యింత అభిమానంతో మెసలుతుండటం ఆమెకెంతో ఆనందాన్ని కలిగించింది. నెలనెలా డబ్బు పంపించటం, వుత్తరాలమీద వుత్తరాలు వ్రాస్తున్నట్లు మరది, పద్మజ, లక్ష్మి అరుణల క్షేమాలు భర్త చెప్పటంవల్ల యెలాగో కాలం గడచిపోతూంది.

## ౨

కాలగర్భంలో అయిదు నెలలు క్రుంగిపోయాయి. ఆదివారం సాయంత్రం లక్ష్మిని తోడుకొని గుమ్మంలో కాలుపెట్టగానే పాప "చిన్నాన్న చిన్నాన్న" అంటూ కాళ్ళకు రెండుచేతులతో లంకె వేసింది. అన్నపూర్ణ యీ గొడవ విని పెరటినుంచి గబగబ వచ్చేసరికి మరది పాపను యెత్తుకొనివున్నాడు. లక్ష్మి నాలుగడుగులు ముందుకేసి వదినని కౌగలించుకుంది.

ఇంతలో "ఇప్పుడే వస్తానని" పాపను దించి బైటకు వదినమాటలు వినిపించుకోకుండా వెళ్లిపోయాడు. లక్ష్మి పెద్ద నిట్టూర్పు విడిచి పాపను యెత్తుకొని బిస్కట్లపేకట్ చేతిలో పెట్టింది.

"ఉత్తరం వ్రాసి వారంరోజులైందే. యింత ఆలస్యంగా వచ్చారేనమ్మా" అంది వదిన.

క్రిందకు దిగాలనుకున్న పాపను దించేస్తూ వది

వతో వసారాలోనికి వెళ్తూ "వయం! చిన్నన్నయ్య ఈమధ్యగా యిలా అడగ లేదు."

"ఏం?"

"నీవు వ్రాయించిన వుత్తరం అన్నయ్యకు చూపించలేదు వదినా."

లక్ష్మి యిలా యెందుకు దాపరికంచేసిందో ఆమెకు అర్థం కాలేదు.

వసారాలో కూర్చోమంటూ "సరేగానీ! ఇలా చిక్కిపోయా వేం?"

లేనినవ్వు తెచ్చుకొని "బావుంది వదినా నువ్వు చిక్కిపోయి నేను చిక్కిపోయా నంటావ్?"

"మా చెల్లెమ్మ అరుణ అంతా..."

లక్ష్మి యీమాటలకు సమాధానం యీయకుండా వుయ్యాలవేపు చూస్తూ "చిట్టి చాలా పెంకితనం చేస్తున్నాడేమో—సాయంత్రం నిద్రపోతున్నాడా—రాత్రికి పడుకోనిస్తాడూ?"

"నేనడిగినదానికి జవాబు చెప్తావా?"

"ఏం చెప్పను వదినా" ముఖం త్రిప్పుకొనే అంది "దాపరిక మెందుకమ్మా? నే నేమైనా అనుకుంటా ననా?"

"అదికాదు వదినా—మా అమ్మే వుంటే" లక్ష్మిగొంతుక పట్టుకపోయింది. కంటిరెప్పలు చెమ్మగిలినాయ్.

అన్నపూర్ణ గతుక్కుమన్నా సర్దుకొని "చెప్పమ్మా ఇక్కడున్నానే గానీ నా మనసంతా అక్కడే వుండేది, కానీ బుచ్చి మనసు తెలుసు కాబట్టి యేదో కొంత ధైర్యంగా మెసిలేదాన్ని"

"చిన్నన్నయ్య యేంచేస్తాడు వదినా, నిజానికి నాకీయింటికి రాటానికి యిష్టం లేకే నీవు వ్రాయించిన వుత్తరం దాచేశాను కానీ—"

ఏదో అవమానం పీక్కుతినటంచేత అన్నపూర్ణ అన్నది "అవునమ్మా! ఇల్లు గుల్లచెయ్యటానికి యిల్లాలి నయ్యానా?"

ఈప్రశ్న లక్ష్మిని వ్యాకులపరచింది. వదిన యింకోలా అర్థంచేసుకుందని గప్పున గొంతుక వరస మార్చి "నిన్నంటే మాకళ్లు పోతాయ్ వదినా. ఏ నిష్ఠూరం వేసినా అన్నయ్యల మీద వేస్తాంగాని"

"మగవాళ్లు—వాళ్లుగొడ్డుల్లా కష్టపడి యింట్లో తెస్తేనా మనం సంసారం సాగించేది? ఈ నిష్ఠూరాలనీ, యింటివ్యాపకాలనీ వాళ్ల నెత్తిన యెక్కిస్తే మనం వుండియెందుకు?"

లక్ష్మి వదిన యింకేదో అనబోతుంటే హఠాత్తుగా "నాకేది యిచ్చిపుచ్చుకో లేదని యీనాడు కాదు యేనాడూ అనను. అన్నయ్యలదగ్గర నుంచి ఒకచల్లని కబురైనా ఆశిస్తుంటాను."

అన్నపూర్ణ పాలిపోయినముఖం కొంత నిగారించింది. "ఏం! వుత్తరాలు వ్రాస్తున్నారుగా!"

"ఒక వుత్తరంలోనైనా నాగురించిగానీ, అరుణగురించిగానీ ఒక మాటైనా వ్రాశారా? మావూసే అక్కరలేని అన్నయ్యముఖం యెందుకు చూడాలి?"

వదిన విభ్రాంతితో "వ్రాయ లేదూ?" అంది.

"లేదు. వ్రాసుంటే అనటానికి నానో రెలావస్తుంది? పోనీ నీవైనా?"

అన్నపూర్ణకళ్ళల్లో నీళ్లు నిండుకున్నాయి. ఒత్తుకొని "అన్నదమ్ములు యింగ్లీషులో వ్రాసుకుంటారు. ఏదో ఆయనచెప్పింది నమ్మతాను గానీ నన్నిలా అబద్ధాలాడి మోసం చేస్తారని యెలా అనుకుంటాను? నేను వ్రాయటానికి వానాకాలం చదువాయె—వ్రాయటానికి ఆయన తప్పించి యింకెవరున్నారు? ఏదో మా తమ్ముడు రాబట్టి ఆయనకు తెలియకుండా అన్ని కష్టసుఖాలు వ్రాయించాను."

"నేను అంతే అనుకున్నాను. అన్నయ్య రమ్మనమన్నట్లు వ్రాయించావు గాని అన్నయ్య రమ్మంటాడా వదినా?"

"ఎందుకనరమ్మా? మీమీద అభిమానం లేకపోతే నెలనెలా యిక్కడ కష్టపడైనా మీ రెక్కడ బాధపడ్తారేమో అని."

"అంత అభిమానంవుంటే మరేం?" చప్పున అర్థోక్తిలో అందుకున్న లక్ష్మి మాటలతో వ్యాకులపడి "ఏం? పంప లేదూ?"

"లేదు వదినా ఒక్కానీ పంపలేదు. చిన్నన్నయ్య సంగతి నీకు తెలుసుగా. ఇంట్లో పస్తుంటాడుగానీ దగ్గర స్నేహితున్కైనా ఒక దమ్మిడీ అడగడు. ఇళ్ళడైకు షాతికపోను సంసారం యేం సాగిస్తాడు?"

అన్నపూర్ణ తల మొత్తుకుంది. లక్ష్మి యింకా చెప్పుకుపోతోంది "మొదటి నెల చూశాం. డబ్బు పంపలేదు. చిన్నన్నయ్యకు వ్రాయటానికి యిష్టం లేదు. తెచ్చినజీతం పాలవాళ్ళకీ, యింటి అద్దెకూ, చిల్లరబాకీలకే పోయింది. కోరికోరి పంతంమీద తెచ్చుకున్నావ్ తోటికోడల్ని. ఆవిడని యెప్పుడూ మెప్పిస్తూ కూర్చుంటేనే ఆ యింట్లో యీ తల్లి లేని పిల్లలు మెసలేది."

ఈ మాటలు అన్నపూర్ణ వినలేకపోయింది ముఖం పెడగా త్రిప్పి కన్నీరు కార్చుతోంది.

"బలవంతంచేసి నేనే చిన్నన్నయ్యచేత వుత్తరం వ్రాయించాను. పెద్దన్నయ్య యేం మనసులో పెట్టుకున్నాడో మాకేం తెలుసు వదినా?"

జబాబు చెప్పటం కానీ, యిటు వేపు చూడటం గాని చెయ్యలేదు. పెదిమలచివర గగుర్పాటు కలిగిందామెకు,

"బట్టను చూసి కోటు కత్తిరించుకో"మని పదిహేనురోజులుపోయాక జబా బిచ్చాడు. చిన్నన్నయ్య యీ వుత్తరం చూసి ముఖం మాడ్చుకున్నాడు పెద్దన్నయ్యకోపం నాకు తెలుసుగా మళ్లీ నచ్చచెప్పి యింకో వుత్తరం వ్రాయించాను. ఆ వుత్తరానికి జబా బీయలేదు. రెండో నెల పెద్దన్నయ్య ఒక వుత్తరం వ్రాశాడు మొదటి వుత్తరం సంగతి లేకుండా. నేనూ యిక్కడ సంసారం సాగించాలి. నాదగ్గరనుంచి యెటువంటి సహాయం గురించి ఆలోచించకని— నేను యీ వుత్తరం చూసి యేడ్చాను వదినా? చిన్నన్నయ్య యేమీ అనలేదు. కానీ ఆవిడ పెద్ద హంగామా చేసింది. ఆవిడ వద్దంటే బలవంతం చేసి నేను వ్రాయించినందుకు ఫలిత మిదని—ఆవిడ మాట కద్దా? నీవున్నప్పుడు పొయ్యదగ్గరకు వెళ్తే కోప్పడేదానివి. నేను స్కూలునుంచి వచ్చేవరకూ పొయ్యి రాజెయ్యదు. పోనీ నేనేదో కష్టపడ్డాను. కానీ అరుణ !!"

"నాఅరుణ నేం చేసింది?" అంది తొందరగా అన్నపూర్ణ. బహుఆతృతతో అటమటిస్తుంటే లక్ష్మి పెదిమలు వేగంగా కదపలేకపోయింది.

"చెప్పమ్మా చెప్పు ఏంచేసింది?"

"ఏం చేస్తుంది? చంపెయ్యదుగా" అంది లక్ష్మి. వదినమనసు ద్రవించిపోయింది.

"ఆ పిల్లచేత నానాచాకిరీ చెయ్యిస్తుంది. దాని వయస్సెంత వదినా—అప్పుడే అది పొయ్యి రాజెయ్య గలదా? నేనా, పదిగంటలకు పోయి సాయంత్రం వస్తాను. అన్నయ్య ప్రొద్దున పోయి సాయంత్రం వస్తాడు. రోజూ నేనింటికొచ్చేసరికి యేడుపు. వదిన ఇలా చేసింది, అలా చేసిందని. నేనేదేనా అంటే నోటికొచ్చినట్లు అనేస్తుంది. నాలుగు కాలాలపాటు బ్రతికుండవలసిన మనిషి కదా అప్పుడే యింత కుళ్లెందుకు వదినా? ఆవిడలా చీరలు కొనమని యేం అల్లర పెట్టున్నానా! నువ్వున్నప్పుడు ఏం కొన్నావో అవే. అరుణ మాసినబట్టలతో నీ వున్నప్పుడెప్పుడైనా వుందా? నీవు మాని, పాప కూడా లేకుండా తల్లిలేనిపిల్లలని మమ్మల్ని ముందు చూసేదానివి. నువ్వుండబట్టి మా అమ్మను మరచిపోగలిగాము గాని లేదా అంటే అన్నయ్యలిలా వున్నందుకు మేం యేమయ్యేవాళ్ళం వదినా?"

అన్నపూర్ణ కళ్లు చీరకొంగుతో వత్తుకుంటోంది.

"పెద్దన్నయ్య కోపిష్ఠి అని నే నెప్పుడూ ఏడవలేదు అన్నయ్య కోపిష్ఠి, అవటానికి కారణం మనమే. అమ్మపోయాక యిల్లు నిలబెట్టాడా. ఈ సంసారం సాగించటానికి యెంత హైరానుపడ్డాడు. మేం అందరం పీక్కుతినేవాళ్ళం. కాని చిన్నన్నయ్య యేం కష్టపడ్డాడు. ఈ అయిదు నెలలకే యెంత మారిపోయాడు. మాటలతో మమ్మల్ని పీక్కుతింటుంటే యెందులోపడి చావాలి వదినా?"

"నేను చచ్చిపోలేదమ్మా" అంది అన్నపూర్ణ.

"ఆ ధైర్యమే బ్రతకాలనిపించింది. ఐనా మగాళ్ళమాటలు సాగుతాయిగాని"

"సాగినన్నాళ్లూ సహించిన వాళ్లుంటే సాగుతాయ్."

"నీ విలా అంటావుగాని—ఇప్పు డేమైంది వదినా."

"అయిందేదో అయిపోయింది. బుచ్చికి శెలవు దొరకలేదని, మీరంతా కులాసాగా వున్నారని యిలా అబద్ధాలాడి యింతవరకు తెచ్చారు. అంతా మరచిపో అమ్మా."

వదిన బ్రతిమాలేసరికి లక్ష్మి కళ్లు నీటితో నిండినా సర్దుకొని "మరచిపోకపోటానికి యిదేం పెద్దవిషయాలా వదినా. ఇన్నాళ్లూ మనసులో దాచి పెట్టుకున్నది నీ దగ్గర వెళ్లగ్రక్కేశాను."

లక్ష్మియొక్క యీ పరిపూర్ణ హృదయాన్ని వదినా! యెన్నోసార్లు చవిచూసింది.

"ఆయన వెక్కిరించినా యేమన్నా—మీ అందరు చూపించిన అభిమానంవల్లే బ్రతికాను."

"అభిమానం నీమీదే యెందుకు చూపించాలి వదినా ఆపద్మజమ్మ పెద్దింటిపిల్ల కావచ్చుకాని నిన్ననటానికి అధికారం యెవరిచ్చారు? చిన్నన య్యలా చేతకానివాళ్లం అవుతామా? ఒకనాడుమన సుండబట్టక యీ యింటికి రాటానికి నువ్వే కారణమని చెప్పాను. వుండిపోదు. ఏం భాగ్యభోగాలు అను భవించటానికి వచ్చేశా అంది. అన్నికష్టాలు పడ్డపుడు అన్నయ్యమా ఎదురుగా నీమీద విరుచుకుపడ్డప్పు డైనా యిలాంటిమాటలు అన్నావా వదినా? ఏమైనా చిన్నన్నయ్య యెదురుగానే అనేస్తుంది."

"నన్ను పొగడటంతోనే గడిపేస్తున్నావు. అరుణను విడిచిపెట్టి యెలాగ రాగలిగావు"

"వచ్చేటప్పుడు ఒక్కటే ఏడుపు, తీసుకు వెళ్దామంటే అన్నయ్యకు కోపం వచ్చింది. నిన్ను తల్చుకొని రోజూ ఏడుపే."

"బ్రతికుండి చచ్చిన దాన్నయ్యాను."

"నీ పేరెత్తితే ఆవిడగారికి మంట! నువ్వేదో చిన్నన్నయ్యను మొదటనుంచీ పోకిల్లాలా తిరగ నిచ్చావు కాదని కామోసు. ఇంట్లో లైటులు దాని చేత తుడిపిస్తుంది. నేను చేస్తానంటే యిప్పటినుంచి పిల్లని మొద్దుని చెయ్యకంది. బడికి పంపకుండా ఆవిడ మొద్దును చేస్తుందిగానీ నేనా చేస్తాను? ఒక నాడు నే నింటికొచ్చేసరికి వెక్కి వెక్కి యేడుస్తోంది. ఏమే అంటే ఏడుస్తుంది కానీ చెప్పదు. తరవాత తెలిసింది. డోము తుడుస్తున్నప్పుడు జారిపోయి ముక్కలైపోయింది. దానికి ఆవిడగారు చెయ్యి చేసు కున్నారు."

"కొట్టడమే!" అంది ప్రాణం పోయినట్లుగా. "కొట్టడం ఆవిడ కొనితీసుకరా అక్కర్లేదు వదినా. నేను ఆవిడ వయస్సుదానిని అయిపోయానుగాని లేదా అంటే నన్నూ కొట్టేదేమో! అయినా వూరు కుంటా? మాటలతో పీక్కుతింది."

ఈ మాటల ధోరణితో దుఃఖం ముంచు కొచ్చినా యెలాగో విన్నది వదిన.

"ఆవిడ నెవరు కులాసాగా ఆనందంగా వుండొద్దన్నారు. ఇద్దరూ కలసి మమ్మల్నిద్దర్ని వది లేసి సినీమాలకి వెళ్లేటప్పుడైనా యేమైనా అన్నామా? ఆవిడగారికి సిల్కుజాకెట్టు గుడ్డలు తెచ్చేటప్పుడైనా ముఖం ముడుచుకున్నామా? మా మానాన మేం యింట్లో మసలుతుంటే ఆమె కాఓర్వలేని తనం యెందుకు? మొదటిలో పెళ్లి ముందు అంత పెద్దకబు ర్లాడిన చిన్నన్నయ్య యేమయ్యాడు? నిన్నర్థం చేసు కున్న వాళ్లు గొప్పవాళ్లైయుండాలి వదినా—నీకు కోపం వస్తే రావచ్చు. నువ్వనుకున్న మరిది, యిప్పుడు నీయింటికి రాలేదు."

అన్నపూర్ణ ఆడబడుచు యిచ్చే అభిప్రాయాల తోపాటు మనస్సులో అలుముకుంటున్న విషయాల వల్ల వర్ణించలేని బాధపడుతోంది.

లక్ష్మి ముఖం యెత్తి అన్నది "నీయెదురుగా నాచదువు విషయమై అన్ని కబుర్లాడాడా? వచ్చే యేటినుంచి చదువు మానేమన్నాడు"

"ఇంత వేగంగా మారిపోయారా అమ్మా"

"మొదట్లో యే పట్టుదలతో వున్నాడు. అవిడ యేం మంత్రం వేసిందో మరి. అత్తవారింటి దగ్గరనుంచి అవీ, యివీ రాసాగినయ్. మొదట్లో యెందుకని కేకలువేసినా మళ్ళీ వూరుకొనేవాడు. ఇదీ అదీ లేదని చెప్తే యెక్కడనుంచి తేవటం అంటూ చిరాకుపడేవాడు. తరవాత ఆవిడ యేం చెప్పిందో యేమిటో రానురాను మా వూసే యెత్తేవాడు కాదు. తిన్నారా చేశారా అని అడగక్కర్లేదు. ఉన్నామ నైనా, పైవాళ్లం కామనైనా ఆలోచించనట్టుంది. ఇల్లు మారిస్తే అద్దె చాలా కలిసొస్తుందంటే యిల్లు కరువాయెను. ఇలాంటి యిల్లు వదిలేస్తే యిన్ని సదు పాయాలున్న యిల్లు తక్కువకు దొరకదు. కన్నవా రింటిపొరుగులో యిల్లు చూసింది. నాకు ససేమిరా ఇష్టంలేదు. అన్నయ్యతో చెప్పాను. ఆ యిల్లు చవకగా ఉంది అని తేలికగా అనేశాడు. నా కష్టం యేమిటో చెప్పలేకపోయాను వదినా."

"కన్నవారి పొరుగున మరింత..." వాక్యం సగంలో ఆగింది వదిన.

"అదికాదు వదినా. ఈ సెలవు లెందు కొచ్చాయోగానీ...కన్నవారింటోనించి గ్రామఫోను తెచ్చింది. రోజూ సాయంత్రం వాళ్లన్నయ్య యేవో క్రొత్తక్రొత్త రికార్డులు తెచ్చి యిల్లంతా గోల. ఎందుకొస్తున్నాడని చెప్పను? ఏదో పేలుతాడు. ఎంతని సహించను, కనపడకుండా ఏమూలో దాగుంటే ఆవిడగారికి కోపం. మాఅన్నయ్య ఇంటి కొస్తే నీకెందుకు కోపం అని అంటుంది. నిజంగా నాకు కోపమే. కానీ అనలేదు. వచ్చేవాళ్లు శుభ్రంగా పోతే నాకెందు కొదినా కోపం? వాళన్నయ్య అందగాడని ఆవిడ మురిసిపోవాలి గాని నన్ను మురిసిపోమంటే నామనసేలా ఒప్పుతుంది? మొన్న నే యిల్లు మార్చేశారు. అప్పుడే ఆయనగారు రోజంతా బాతాఖానీ - చిన్నన్నయ్య వున్నా కూడా కేరింతాలు మన్యను ఒకరోజుకే సగంవచ్చాను"

అన్నపూర్ణ పెద్దనిట్టూర్పు విడిచింది. పాప యిటూఅటూ గదిలోకి, చావిడిలోకీ తిరుగుతూ బిస్కట్లు పూర్తిచేసి అత్తయ్యవేపు చూస్తూనే దగ్గర కూర్చుంది. పాపను దగ్గరగా చేరదీసి "ఇలాంటి పిల్లలని కొట్టడానికి చేతులెలా వస్తయ్ వదినా! నలుగురు మధ్యా నీగురించి చెప్తూ ఆ కోతిపిడ వదిలిందంది. అరుణ అక్కడే వుందేమో "ఫోనువ్వే కోతి" వంది. "ఛప్ నోరుముయ్" అంటూ చెయ్యెత్తిం దావిడ. అరుణ "నువ్వే కోతివి ఫో నువ్వే కోతి" వని రెట్టించింది. గప్పున లేచి వీపుమీద చరిచింది. గదిలోనించి చూస్తున్న దాన్ని భరించలేకపోయాను. అరుణను తీసుకొని "చేతులెలా వచ్చాయమ్మా" అనే సరికి అగ్గిమీద గుగ్గిలంపడ్డట్టయింది. "మేం కోతులం కామంది"

"నిజమే కొరమ్మా! కోతులైనా పిల్లలను చూసి కొస్త కనికరిస్తయ్" అన్నాను. ఆవిడ మరింత రేగింది. "ముదిస్తూ కూర్చో. సిగ్గుపడనివాళ్లకి యేంచెప్తే యేంలాభం?" అంది. ఎంత కోపమైనా వచ్చింది. ఏం చేస్తాను? నా నాలిక నేనే కరుచుకొని యేడ్చు కున్నాను. ఏమైనా అంటే యింటినుంచి పంపించే టంత చాకచక్యం కూడ వుంది. అప్పు డెక్కడికి వెళ్ళటం.—పెద్దన్నయ్యకు కోపం. అయినా ఆరాత్రి యెక్కడికైనా వెళ్లిపోయి అనుకొక్కని బ్రతుకుదా మనిపించింది. కానీ మా అమ్మ లాంటిదానివి నువ్వొకర్తి వున్నావు. ఒకనాడు కాకపోతే యింకో నాడైనా అన్నయ్య మనసు మార్చి మా కోసం పంపిస్తావ్. అప్పుడు మేం యింట్లో లేకపోతే నువ్వు బెంగపెట్టుకుంటావ్— నీపిల్లలు మాలా అవటానికి నేనే కారకురాలవ్వాలా? నాలాంటిదానికి పౌరుషం వుండి యెందుకని చంపేసుకున్నాను. అరుణ నాప్రక్క నే పడుకుంది. పెంచిందినువ్వు. ఉండివుండి నీకోసం పలవరిస్తోంది. ఏం చెయ్యటమో తోచక బేజారెత్తిపోయాను. అప్పుడే నీకు వుత్తరం వ్రాద్దా మనుకున్నాను. కానీ నాకు తెలుసు. నీకా వుత్తరం అందదని. మళ్లీ దేవుడిమీద భారం వేశాను. నాకర్మ మిట్లా కాలిందనుకున్నాను—"

ఈమాట లింకా లక్ష్మినోటిలో వున్నయ్ స్తంభానికి చారబడి వున్న వదిన చీరకొంగుతో కళ్లు కప్పుకొని వెక్కి వెక్కి యేడ్చేస్తుంది. ఆ యేడుపు చూసి లక్ష్మి కళ్లల్లో నీళ్లుబాగా నిండుకున్నయ్. పాప తల్లిమీద చారబడి కళ్లు నులుపుకుంటోంది. చాలసేపటివరకు యెవరి నోటంటా ప్రయత్నించినా మాట రాలేదు. చివరకు వదిన మెల్లగా అడిగింది "క్రొత్త యింటికి వెళ్లాక యేమైనా నోరు జారేశావా" అని.

లక్ష్మి కొంచం తేరుకొని "వెళ్లిన రెండో రోజు నే అన్నగారితో యెన్నో విషయాలు చెప్తోంది. నేనక్కడనుంచి పెరటికి వెళ్లిపోయాను. తరవాత వచ్చి ఒకసారైనా నవ్వుముఖం చూడలే దన్నాడు. నాకు రిమ్మెత్తింది. సహించలేకపోయాను. తిమ్మనలా వున్నావని వెక్కిరించాను. అంతే నేను చేసింది. ఆవిడగారు యేంచెప్పారో యేమిటో నాకేం తెలుసు"

"సరే లే అమ్మా—ఎప్పుడు నైలెక్కావో కొస్త—"

"ఇప్పుడేమీ అక్కర్లేదు..."

ఇంతలో నిద్రమేల్కొని మూలుగుతున్న చిట్టిని యెత్తుకొని ఆడిస్తూ కూర్చుంది. వదిన వంటయింటి వేపు వెళ్లింది. వంటయింటినుంచి తిరిగివస్తున్న వదిన వేపు చూసి "చూశావ్ వదినా నీకొడు కేంచేసాడో?"

"అత్తయ్య మర్యాదని వుంచాడా? వెళ్లమ్మా బిందెలో నీరు వుంచాను. స్నానం చేస్తే..."అంటూ చిట్టిని తీసుకుంది.

ఈమాటల్తోనే బాగా ప్రొద్దుపోయింది. రోజూ సాయంత్రమైతే యిల్లు కదలని యింటిపెద్దా రాలేదు బుచ్చిబాబు కూడా యింకా రాలేదు. పాప, నాన్న యింకా రాకపోవటంతో ప్రాసేవి అఆ, లైనా మాటిమాటికి నాన్న నిసురించి అడుగుతోంది. "అంత ప్రొద్దు వుండనగా వెళ్ళారు. మీరొచ్చారని కామోసు యీ వేళ యింత ఆలస్యం" అందివదిన లక్ష్మితో.

ఇంతలో బుచ్చిబాబు వచ్చాడు. వదినముఖం చూడలేక లజ్జాన్వితుడై పాపను యెత్తుకొని నిలుచున్నాడు. పెరటి వసారాలోనికి వెళ్లి వదిన చిన్నన్నయ్య నేమంటుందో అని చెవు లప్పచెప్పి వింటోంది లక్ష్మి. "ఏమండీ బుచ్చీ! మా చెల్లెలిని తీసుకవచ్చారు కాదు"

"లేదు'' అన్నాడు ముక్తసరిగా వది నేదో గుండె చీల్చే టట్లు మాట్లాడుతుం దనుకుం టే యింకా అభిమానవాక్యాలు పలుకుతుందేమో అని లక్ష్మి లోలోన మండిపోతోంది.

"ఇలా ఒకసారి రండి" అంది వదిన పాపను దించి వెనకాలె వెళ్తూ. "ఇంకో అరగంటలో రైలుంది. వెళ్తా నండి'' అని నమిలాడు మాటల్ని.

"రైలు దిగేసరికి చాలా రాత్రవుతుంది. రేప్రొద్దున్న వెళ్లకూడదూ? ఇంతదూరం వచ్చి మీ అన్నయ్యను చూడకుండా వెళ్తారా?''

"లేదండి వెళ్లాలి''

ఈమాటలు కొంత్త దృఢమైన స్వరంతో రావటంతో "భోంచేసి వెళ్లండి'' అంది.

మరది ముఖంలో విముఖత తిరిగి చూసి కాంతి విహీనమైన నగవుతో "అన్నపూర్ణ యింట్లో అన్నమే కరవా—భోంచెయ్యకుండా వెళ్లటం—యిదెవరు చెప్పారు''

తనమాటలు తనకే అప్పచెప్పటంతో విధిలేక నాలుగు మెతుకులు నమిలాడు.

భోజనం చేస్తుండగా అన్నపూర్ణ యెందుకో మాటాడలేకపోయింది.

చెయ్యి కడుక్కున్న వెంటనే బయలుదేరాడు. వదిన సాగనంపుతూ గదిలోనే "ఆగండి బుచ్చీ" అంది. దగ్గరగా నే లైటు వెలుగుతోంది. మరదిముఖం లోనికి చూస్తూ చెయ్యిపట్టుకొని చేతిలో యేదో పెట్టింది. బుచ్చిబాబు చూశాడు. నాలుగు పది రూపాయల నోట్లు. "అక్కర్లేదు. మీ రీ డబ్బివ పోతే చచ్చిపోం" అన్నాడు.

"నా ముఖం చూడండి— మీఅన్నయ్య కోపం మీకు తెలుసు—యిప్పుడు అబద్ధాలు కూడా నేర్చారు. నేను చచ్చిపోయా ననుకున్నారా? మీరీ డబ్బు తీసుకు వెళ్లకపోతే నన్ను చంపుకుతిన్నట్టు"

వదిన స్వరం శోకమయం కావటం మరదిని కొంచం వ్యాకులపరచింది.

"ఒక తల్లిబిడ్డలు— అందులో మీఅమ్మ యెలా పెంచారో అప్పుడప్పుడూ జ్ఞాపకానికి తెచ్చుకోండి—"

ఈమాటలకు కూడా మరిది కంఠం వుక్కిరిబిక్కిరవటంచేత మాటాడలేకపోయాడు.

"వెళ్లండి— కానీ ఒక్కమాట"

ముందుకు రెండడుగులు వేసినవాడు ఆగాడు.

"ఈసారి మీ రొచ్చేటప్పుడు చెల్లమ్మని అరుణను తోడుకొనే వస్తారు కదూ."

ముందు తటపటాయించినా "హాఁ" అంటూ కదిలాడు.

"ఈ విషయం మరచిపోకండి."

బుచ్చిబాబు తనకాళ్లు బూరగాళ్ళయినట్లు భ్రమపడ్డాడు.

ఇంతవరకూ కొట్టుకొట్టులాడుతూ లోలోన మండిపోతున్న లక్ష్మి భుజంమీద చెయ్యివేస్తూ "బుచ్చి బాగా చిక్కిపోయారు. నువ్వైనా వేళకు భోజనం పెట్టలేదమ్మా" అంది.

ఏమనాలో, యేం చెయ్యాలో తోచలేదామెకు. వదినముఖంలోని విషాదరేఖలు, క్షణకాలపు మౌనం, లక్ష్మిమనసులో ఆలోచనలను రెచ్చకొట్టినయ్. దాచటానికిచోటులేక పైకివెళ్లగ్రక్కింది. డబ్బిచ్చిపంపావ్ నీవు పిచ్చిదానివి వదినా- నిన్ను మోసం చేశాడు."

"నన్నా! లేదు" అంది అదే ధోరణిలో.

"లేమా! కట్నం పుచ్చుకోనని పెద్ద కబుర్లాడాడే ఇప్పుడావిడిగారి ఒంటినిండా బంగారమే"

బహుశః భర్త ఆరాత్రి అడిన మాటలు జ్ఞప్తికి రావటంవల్ల కామోసు అన్నపూర్ణ ఆలోచనలో పంపింది. "మంచిదే. అవసరం వస్తే అప్పైనా దొరుకుతుంది."

"ఇన్ని చెప్పాను వదినా, నా యెదురుగా అడిగితే పోయేదిగా."

అన్నపూర్ణ పొడినవ్వునవ్వటంతో లక్ష్మి నిజంగా వదినకు పిచ్చెత్తిందేమో అనుకుంది. తన్ను కూర్చోబెట్టి అడిగి ప్రయోజనం ?

మరింతరాజేస్తే యేంలాభం ?

"అడిగుంటే యేం అనేవాడో. నిలుచున్నపాటున ప్రయాణం కట్టాడే. ఉంటావా లేదా అంటే యెవరికోసం వుంటాడు."

"ఏదో కోపాలు చల్లార్చి యిల్లు నిలబెట్టాలి మనం. మనం పౌరుషా లంటూ పెట్టుకుంటే వాళ్ళకి చెప్పగలం? చూడు కోపంతో యేదోఅనేశానే అనుకో— అప్పుడు నీవిషయం ?"

"ఏం—"

"మీఅన్నయ్య యీనాడు కాకపోతే యేనాడైనా అసలైన అన్నయ్య కాకుండా పోతారా? నే నన్నమాటలు నువ్వే చెప్పావని నీమీద అసహ్య పడరూ ?"

"పడితే పడ్తాడు—అన్ని పెద్దకబుర్లాడినవాడు అత్తారిడబ్బు యెందుకు పుచ్చుకోవాలి ?"

అన్నపూర్ణ మళ్లీ నెమ్మదిగా నవ్వి, మధ్యను "నీ కెందుకమ్మా యీపంతం—మా యెవరికీ లేనిది?"

"నువ్వెప్పుడూ యిలా సర్దుకొస్తావు వదినా !" అంటూ చప్పున లేచిపోయింది.

వెనకాలే వెళ్లి "ఇంకా నీవు చిన్నదానవమ్మా. మనలాంటి కుటుంబాలలో కష్టసుఖాలింకా మాతోటికోడలిలా నీకేమీ తెలీవు. అవసరం యెంతపనైనా చెయ్యిస్తుంది. బాధపడ్డవాళ్లకిగానీ మిగతావాళ్లకి ఆవిషయాలు తెలియవమ్మా. మీచిన్నన్నయ్య యింతలా మారటానికి కారణం యెవరంటావ్ ?"

"ఇంకొకరి నెందు కనాలి ?"

"ఈయన డబ్బు పంపిస్తే బుచ్చి అలా అవుతారా ? మీమీద మాటలు విసురుతారా? అయిందేదో అయిపోయింది. నడమ్మా. ఎప్పుడు భోంచేస్తావో ?"

"అన్నయ్య భోజనం కానీ."

౮

భద్రం రాగానే పాప బుచ్చిబాబు రాకను పోకనుచాలా గమ్మత్తుగా చెప్పింది. ఈవిషయం ముందుగా తెలిసినట్లే, యిదొక పెద్దవిషయంకానట్టే సరిగ్గా వినిపించుకోకుండా "అమ్మనుపిలు" అన్నాడు ఇంతలో రంగారావు బట్టలు మార్చాడు. అన్నపూర్ణ తూతురువెనకాలే వచ్చి గుమ్మందగ్గర తలదించి నిలుచుంది.

"మీ తమ్ముడు రేపే పోతా నంటున్నాడు.''

ఈమాటలు తనకు కాదన్నట్లుగానే మౌనముద్ర అయ్యింది.

"ఏదీ, వచ్చివారమే అయ్యింది. ఇంకోవారం వుంటే యేంపోయింది.''

బావగారి మాటలకు అందుకున్నాడు— "అక్కడ పదిరోజులైనా వుండకపోతే నాన్నకు కోపం వస్తుంది.''

ఇక బావమరుదులు వాదనలోనికి దిగారు. అన్నపూర్ణ అడ్డొచ్చి "రేపొకరోజుండి, ఎల్లుండి వెళ్లిపో తమ్ముడూ'' అన్నాక అక్కడినుంచి వెళ్లిపోతూ "భోజనాలకి లేవండి'' అంది.

భద్రం భోజనానికి కూర్చొని నేముందు చెల్లెల్ని వంటయింట్లో చూసి హేళనగా నవ్వుతూ "ఈ దొప్పచెవులన్నయ్యమీద అభిమానం పుట్టిందేమో'' అన్నాడు.

ఒకసారి యెవరో క్రొత్తచుట్టం యెదురుగా వదినను వెక్కిరించాడని అన్నయ్యను దొప్పచెవులన్నయ్యని పరోక్షంగా వెక్కిరించింది. అన్నయ్య వర కెలావెళ్లిందని ఆలోచించి యెటువంటిజవాబు యీయలేదు .

మాటల్లో మాటగా పంక్తిలో కూర్చున్న బావతో అన్నాడు "నాలాంటివా డుండబట్టి మీఅక్కయ్య చెల్లిపోయింది."

సహజంగా సిగ్గుకు లొంగే మనిషి రంగరావు. ఒక చిన్ననవ్వు నవ్వి అక్కయ్య వేపు చూశాడు. భద్రం ఇంకా లోకువను బాగా వినియోగించుకుంటుంటే యిక అక్కమీద ఆధారపడి లాభంలేదని నోరువిప్పాడు.

"మీపేరు ఊరూరా చెప్పుకుంటున్నారు''

"చెప్పుకోరటోయ్—ఆపాఅపళ్లు''

"మీపళ్ళ కంటే పెద్దవికావు'' అన్నాడు. చప్పున తనతో యేకీభవించే యీయన నొకసారి లక్ష్మితొంగిచూచింది. రంగారావు యిదివరకన్నా కాస్త శరీరం చేశాడు. తలవంచి భోంచేస్తున్న వాడు గప్పున తలెత్తి యెదురుగా కనపడి వెంటనే మాయమైన కళ్ళని మనసులో వెతుక్కుంటున్నాడు.

ఈసారి బావగా రేమన్నా యెదురాడలేదు. ఒకవిధంగా కులాసాగా వుండి భార్యముఖకళను మార్చాలని యిన్నివిధాల ప్రయత్నించినా లాభం లేక చేతులు కడుక్కున్నాడు భద్రం.

కోపంతో యేదో అనేముందు ప్రయత్నంమీద నోరు నొక్కుకొని ఆలోచించి మళ్ళీ అవసరమైతే అందామనే తత్వం గల మనిషికాబట్టి అన్నపూర్ణ ఆ రాత్రి చాల సేపటివరకు ఆలోచిస్తూనే వుంది.

తెల్లారేక మామూమ్లుగా యింటిపనుల్లో నిమగ్నమయ్యింది. భద్రం ఆఫీసుకు వెళ్లాడు. రంగారావు వీధిలోనికి వెళ్లేముందు అక్కతో చాలాసేపు మాట్లాడాడు. చిట్టిని నిద్రపుచ్చి కూర్చుంది, గదిలో ఒకమూల నేలమీద తలమీద చేయివేసుకొని.

వంట పూర్తియాక పాపతో పాటల పోటీకి దిగింది లక్ష్మి. ఏకాంతరూపా అనే ఎనిమిదిసార్లు వల్లించింది పాప.

ఈ పాటలు బయటకు వినిపిస్తున్నాయేమో రంగారావు తలుపు తట్టకుండా బయట నిల్చుండిపోయాడు. తరవాత లక్ష్మి అన్నపూర్ణల మాటలు విని తలుపు తట్టాడు. లక్ష్మి అక్కడినుంచి మెరుపులా మెరసి మాయమయ్యింది.

అక్క యెదురుగా కుర్చీమీద కూర్చొని "మంచినీరు" అన్నాడు నవ్వుతూ.

"లక్ష్మీ! మంచినీరు తీసుకురా అమ్మా'' అంది తలత్రిప్పి.

"ఏమిటక్కా! కూతుర్ని పిలిచినట్లు''

"కూతురుకంటె హెచ్చు తమ్ముడూ..."

లోపలనుంచి యిప్పటివరకూ యే సమాధానం లేదు. కొంచెం సేపటికి "ఇదిగో వదినా'' అంది. అన్నపూర్ణ నవ్వి "అంత సిగ్గుపడితే యెలా? తీసుకురా మ్మా''అంది. లక్ష్మిగ్లాసు గుమ్మం దగ్గర పెట్టి గప్పున మళ్లీ మాయమై పోయింది.

"ఏమిటమ్మా యింతసిగ్గు— నిన్నెవరూ మింగెయ్యరు'' అంటూ లేచి గుమ్మందగ్గరకు వెళ్ళి గ్లాసుపట్టుకొని చూసింది.

"పో వదినా" అన్నట్లు నవ్వుతున్న వదిన వేపు చూసి ముఖం ముడుచుకొని సైగచేసి పెరటివైపుకు వెళ్లిపోయింది.

మరుచటి రోజు వెళ్లిపోయేముందు ఒంటిగా కూర్చున్న లక్ష్మి వేపు చూస్తుంటే, పరిస్థితి విషమించిందని తెలుసుకొని లక్ష్మి వెళ్లిపోయింది. రంగారావు నాలుగడుగులు ముందుకు వేసి ఆగిపోయాడు.

## ౬

వాతావరణంలో మార్పు వచ్చింది. వరసగా వానజల్లు నాలుగురోజు లుంది. అన్నపూర్ణకు తలనొప్పితో పాటు వుండివుండి కాస్త జ్వరం కూడా కాస్తోంది. అయినా యింట్లో పనిపాటలు పూర్తిగా లక్ష్మిమీద విడిచిపెట్టలేదు.

సంసారం సాగిపోటానికి అవసరమైన విషయాలలో భర్తతో మామూలుగా మాట్లాడటానికి ప్రయత్నించినా యిదివరలా మనసు వికసింపజేసికొని మాటాడలేదు. భర్తను నిలదీసి అడగాలనిఅనుకుంది కానీ ఆపని చేసేముందు ఆలోచించటమే యీపదిహేను రోజులూ ఆమె నిలా మెసలనిచ్చింది. ఏమైనా ఆ వచ్చేనెల జీతాలందేవరకు వూరక వుండటమే మంచి దనుకుంది.

ఆదివారం పదిగంటలు వేశారు. అప్పుడే నాన్న రావటంచేత మంచంమీదనుంచి లేచింది. నాన్న మనుమరాలితో ఆటల్లోపడ్డారు. బొమ్మకావాలని పాప మారాం చేసింది. వీధిలోనికి పాప నెత్తుకొని వెళ్లాడు.

తిరిగివచ్చేసరికి పండ్రెండుదగ్గ రయింది. భద్రం కూడా అప్పుడే వచ్చాడు. ఏలాగో ఓపికపడి అన్నపూర్ణే అల్లుడుమామలకు వడ్డించింది. భోంచేస్తూనే అచ్యుతరామయ్యగారు అల్లు నుద్దేశిస్తూ "ఏమోయ్! టెస్టులు పేసయ్యావు కదా ఇంకో మెట్టెక్కే అవకాశం వుందా?" అన్నారు.

"ప్రస్తుతానికి ఇంతే" అన్నాడు అల్లుడు.

ఈ విషయాన్ని యిరువురిలో యెవరూ ముందుకు సాగించటానికి ప్రయత్నించలేదు. మౌనంతోనే మజ్జిగవరకూ వచ్చారు.

భారీశరీరాన్ని కాస్త పీటమీద సర్ది అన్నాడు "ఆఁ అడగటం మరిచాను— రంగడ్ని యెందుకు పిలిపించినట్లు?"

ఈప్రశ్న కొంచం అసహజమైన స్వరంతో రావటంతో సంకోచంతోనే "వూరకనే" అన్నాడు.

"అంతేనా?" అర్థోక్తిలో అన్న మామగారివేపొకసారి చూచాడు.

"మీ మనసులో యేం వుందో చెప్పండి" అన్నాడు నిర్మొహమాటంగా.

"ఏంవుంది! ఇప్పుడు వాడేం అఘోరిస్తున్నాడు ఇంటా వంటా లేని పని చేస్తున్నాడు"

"ఏమిటా పని?" గభాల్న అందుకున్నాడు అల్లుడు.

"పిలిపించినట్లు పిలిపించి వాడికి నేర్పిస్తావటోయ్."

"మేమేం నేర్పించక్కర్లేదు మెత్తగా వున్నా నేర్పించేవాడు మీవాడే"

"ఇదిగోనోయ్— దాపరికమెందుకూ? కులం మార్పుకు నేను ఒప్పుకోను"

చేతిలో అన్నం, భద్రం యెదురుగా నున్న ఆకుమీద పడిపోయింది. త్రుళ్లిపడ్డాడు. క్రోధారుణిత నేత్రాలతో భార్యవేపు చూశాడు. చలించనట్లే ఆమె తలదించుకొని నిలుచుంది. చలించిందిప్పుడు భద్రం. లేచి చెయ్యికడుక్కున్నాడు. గదిలోనికి వెళ్లిపోయి బట్టలు మార్చి, భడాలున తలుపు వేసి వీధిలోనికి వెళ్లిపోయాడు. బొమ్మతో ఆడుకుంటున్న పాప త్రుళ్ళిపడింది. బొమ్మనుగట్టిగా పట్టుకొని కేక వేసింది.

అందరి గొంతుకలు కటుబడ్డాయ్. అచ్యుతరామయ్యగారు బొజ్జ నిమురుకుంటూ అంగటిగదిలో వాలుకుర్చీమీద చారబడ్డాడు.

ఆవులింతలు తీస్తు కూర్చున్న తండ్రిదగ్గరగా వచ్చి నిలుచుంది. ముఖం దించుకొని "ఇంకేమైనా అనాలని వుంటే నే నున్నాను నాన్నా" అంది.

"నువ్వీ విషయంలో మధ్యపడకమ్మా" సహజమైన ప్రేమతోనే.

"తమ్ముడితో చెప్పించాన్ని నేనే. ఆయనకీవిషయం యేమీ తెలీదు నాన్నా"

"కప్పకొస్తున్నావు గానీ— ఇదాపనీ!"

"నామాట నమ్మరా నాన్నా" అంది కంపించే గొంతుకతో. ఈ గొంతుక కొంతవరకు పనిచేయటంచేత తండ్రి జవాబీయలేకపోయాడు.

అన్నపూర్ణ మళ్లీ అంది "నేనే వుత్తరం వ్రాయించాను. నేనే ఆ పిల్లను చూపించాను. చేసిందంతా నేనే. ఆయనకేమీ తెలీదు."

"ఏంకానీ! నాకు ససేమిరా యిష్టంలేదమ్మా. ఈ కబురు చెప్పడానికే వచ్చాను— ఎక్కడకో వెళ్ళినట్లుంది. విన్నా వినకపోయినా యీ కబురు చెప్పేయ్—వస్తాను" అంటూ కుర్చీమీదనుంచి లేచిపోయాడు.

ఇంత వేగంగా వెళ్ళటానికి నాన్న లేచినా అన్నపూర్ణ వుండమనైనా అనలేకపోయింది. బట్టలు వేసుకొని గొడుగు పట్టుకునేవరకూ తండ్రివేపు కొయ్యబారి చూస్తోంది. చివరకు "ఆశ విడిచిపెట్టుకోమంటారా నాన్నా" అంది.

"నువ్వే చెప్పమ్మా! ఇదేం సబబుగా వుందో."

"తెగతెంపులుచేసి నేనెలా మాట్లాడుతాను నాన్నా. పిల్ల మాది. పెంచాం పెద్దచేశాం. పీక నులిపేస్తామా?" అంది. ఈ మాటలు హృదయారాటాన్ని విస్పష్టంగా బహిర్గతం చేస్తోంటే తండ్రి అలా నిలుచుండిపోయాడు.

"ఉన్నవాడొక్కడేనా...నలుగుర్లో."

"దీనికేమీ పరువు పోతుందా నాన్నా?"

ముసలాడు ముఖం త్రిప్పి "మీ అమ్మకూడా యిష్టంలేదు. నామాట విను. కాదంటే ఆపిల్లకేదో సంబంధం చూద్దాం" అంటూనే ముందుకుసాగాడు.

"పేదవాళ్ళ యింటిలో పుట్టడమే ఆ పిల్లచేసిన తప్పు. అయినా మేం పస్తుండైనా ఆ పిల్లను ఒక యింటిదాన్ని చెయ్యకుండా పోతామా? వెళ్ళండి నాన్నా" అంది.

నాన్న ఒక్కొక్కడుగు వేస్తోంటే అన్నపూర్ణ గొంతుక రానురాను శోకంనుంచి తేరు

కుంటోంది. గుమ్మందగ్గర కాలువేసి వెనుకకు చూసే సరికి కూతురు చీరకొంగుతో కళ్లు ఒత్తుకుంటోంది.

"వస్తానమ్మా" గొణిగాడు తండ్రి.

"మంచిది నాన్నా—కూతురి కిచ్చినడబ్బు కొడుకు నమ్మైనా రాబట్టుకోండి."

డబ్బుకూ తనకూవున్న సంబంధ మెలాంటిదో తెలిసున్న కూతు రిలా అంటుందని యేనాడూ అనుకోని పెద్దమనిషికి ఒళ్లొక్కసారి పీక్కుపోయింది.

"వచ్చారు—ఇంట్లో పెద్దకలహం లేవదీసి పోతున్నారు. వెళ్ళండి—నాకు తల్లీ తండ్రీ లేర నే బ్రతుకుతాను."

ముసలాడి చంకనున్న గొడుగు జారిపోయింది. అన్నపూర్ణ అక్కడ నిల్చోలేక రెండో గదిలోనికి వెళ్లిపోయి మంచంమీద కూలబడింది. కూతురు మాటలు కాళ్లను బంధించినా ప్రయత్నంమీద ముందుకు కదిలాడు.

ఎండ చల్లబడ్డాక అచ్యుతరామయ్య మళ్లీ వచ్చాడు. నాన్నను తను పలకరించకుండా నిద్ర నుంచి లేచిన కూతుర్ని కూడ దగ్గరకు వెళ్లనీయ లేదు. వీధి గదిలో కూర్చొని చివరకు రెండో గదిలోకి వెళ్లాడు. తలనొప్పితో పడుకున్న కూతుర్ని పిలవటానికి ప్రయత్నించాడు గాని పిలవలేక అక్కడే వున్న పాపను యెత్తుకున్నాడు. పాప చేతితో నోరు మూసుకుంది.

"చాల్లేవే నీ వేషాలు—కళ్లుకూడా మూసేసుకో—పళ్లూడిన ముసలాణ్ణిగా."

"చెవులు కూడ" పాప కళ్లుమూసుకుంది.

పాప ఒక్కసారి కళ్లు తెరచి లల్లలల్లా అని నాలికతో వెక్కిరించింది.

"చూడమ్మా! నీ కూతురు చెవులుపట్టుక ఆడిస్తోంది...."

అన్నపూర్ణ లేచి కూర్చుంది. మంచంమీద కూతురు ప్రక్కనే పాప నెత్తుకొని కూర్చొని "చాలా పెద్దమాట లనేశావమ్మా" అన్నాడు.

ఆమె యేమీ అవలేదు. ముఖం దించింది. కానీ దుఃఖం మాత్రం వుబికిపోతోంది. ముసలాడు ముక్కు కొస్త నలుపుకొని "నీకంతే నమ్మా" అన్నాడు. శోకం నిండుకున్నా కళ్లు కప్పుకొని "కన్నవారిమీద నిష్ఠూరం వెయ్యక యింకెవరిమీద వేస్తాను నాన్నా" అనేసరికి ముసలాడి కంటిరెప్పలు చెమ్మగిలినాయ్. పాప నోరు తెరచి ఆకళ్ల వేపు చూస్తోంది. వాళ్లజీవితాల్లో ఆపుకో లేని దుఃఖం మళ్లీ యిద్దరికీ ఒక్కసారి పొంగటం యిది రెండోసారి

అచ్యుత రామయ్య గారు కొంతసేపయ్యాక "అమ్మను వారం పదిరోజుల్లో మంచి రోజు చూసి పంపిస్తాను" అన్నాడు. తండ్రి వెంటనే రైలువుందని ప్రయాణం కట్టాడు. వెళ్లేముందు "చాల నీరసంగా వున్నావు. కొంచం జాగ్రత్తగా వుండమ్మా" అన్నాడు.

అన్నపూర్ణ మౌనంగా నిగారించిన ముఖంతో కూతుర్ని యెత్తుకొనే గుమ్మంవరకూ సాగనంపింది. గుమ్మందాటుతున్న తాతయ్యని పిలిచి మరీ లల్లా లల్లా అని వెక్కిరించింది పాప.

పోవే అంటూ ముసలాడు వెనక్కి తిరిగాడు. విరగబడినవ్వుతూ మళ్లీ పాప వెక్కిరించింది.

పాప బుగ్గ పట్టుకొని, రెండోబుగ్గ మీద ముద్దులాడి "వస్తానమ్మా" అంటూ వెళిపోతోంటే కూతురు తండ్రి కనిపించేవరకూ చూస్తూనే వుంది.

## ౧౦

వీరభద్రరావు వచ్చేసరికి బాగా చీకటిపడింది. అన్నపూర్ణ కొంచం జ్వరం తగలటంవల్ల మూలుగుతూ మంచంమీదపడుంది. అన్నయ్యను చూసి లక్ష్మి పెరటిలోకి వెళ్లిపోయింది. చిట్టి వుయ్యాలలో నిద్రపోతున్నాడు.

పాప ఒక్క త్తె తప్పించి ఆ యింట్లో ఆయనను అప్పటికి పలుకరించే వా రెవరూ లేకపోయారు. తండ్రిచుట్టూ గెంతులేస్తూ తాతయ్య నెలా వెక్కిరించిందీ చెప్పుకొస్తోంది. చిరాకుగావున్నా ఒకొక్కసారి దృష్టి పాపమీద పడటంచేత నవ్వు వస్తున్నా ఆపుకున్నాడు.

అన్నపూర్ణ ఒకఅరగంట పోయాక మెల్లిగా లేచి వచ్చి "భోజనానికి లేవండి" అంది. మాటాడకుండా లేచి పెరటకు వెళ్లాడు. చేరువలోనే కూర్చొని "అప్పుడనగా వెళ్లి యింత ఆలస్యంగా

వచ్చారేం" అంది. భద్రం నోరు మనసు భోజనం మీదే లగ్నమైయుంది. లక్ష్మితో యిది తీసుకరామ్మా అది తీసుకరావమ్మా అని చెప్తానే భర్త భోజనం అయ్యేవరకూ అక్కడే కూర్చుంది.

సోమవారంనాడు యింటియజమాని ఒక క్రొత్తమనిషిలా మెసలటం తప్పించి మిగతావన్నీ మామూలుగానే జరిగిపోతున్నయ్.

నాలుగురోజులు పోయాక ఒంట్లో కొంత నిమ్మళించాక భర్తతో లక్ష్మి పెళ్లివిషయం మెల్లగా నచ్చచెప్దామని, తరవాత మరదికి వుత్తరం వ్రాయిద్దామని, సంకల్పించుకుంది. కానీ మంగళవారం చీకటి పడ్డాక బుచ్చిబాబు, పద్మజ, అరుణ రావటంతో అన్నపూర్ణ ఆశ్చర్యపడింది.

అరుణ పరుగెత్తివెళ్లి మంచంమీద అన్నపూర్ణ ఒడిలో పడి వెక్కి వెక్కి యేడ్చేస్తోంటే అందరూ అలా నిశ్చేష్టు లయ్యారు. వదిన కళ్లు మసకలు కమ్మినట్లనయ్. మాటాడటానికి గాని, ఆలోచించటానికి గానీ పాలుపోలేదు. వదిన చెక్కిళ్లపై కన్నీరు జారటం బుచ్చిబాబు చూశాడు. చివరకి యెక్కడనించి శక్తివచ్చిందో లేచి అరుణను యెత్తుకొని మెల్లగా పెరటుకు నడిచింది. వదిన యెక్కడ పడిపోతుందనో లక్ష్మి వెనకాలే వెళ్లింది. వసారాలో కూర్చోబెట్టి అన్నం తీసుకరమ్మని సైగ చేసింది. అరుణ వీపుమీద వేసిన చెయ్యి ఆపిల్ల భోజనం పూర్తి చేసేవరకు తీయలేదు.

లక్ష్మి వంటయింటిలో క్రొత్తగా వంటప్రయత్నంలో వుంది. ఆమె వెనకాలే పద్మజ కూడ వుండి సహాయం చేస్తోంది. భోజనాలు పూర్తయేసరికి తొమ్మిదిదగ్గ రయ్యింది. అన్నదమ్ములిద్దరూ భోజనం దగ్గర ముభావంగానే వున్నారు.

వదినా మరుదులు మాట్లాడుకోనే టప్పుడు పద్మజ రెండుసార్లు ఆగదిలోనికి వచ్చి యేదో సామాను తీసుక వెళ్లింది. ఆమె ముఖంలో యిదివరకున్న కళ యిప్పుడు లేదు. కొంత రగడదేరిన మనిషిలా వుంది. కోరి లక్ష్మికి వంటప్రయత్నంలో సహాయం చెయ్యటం కూడా అన్నపూర్ణకు పరిపరివిధాల ఆలోచించటానికి ఆస్కారం యిచ్చింది.

భోజనాలయ్యాక పిల్లలు ముగ్గురూ పడుకున్నారు. బుచ్చిబాబు, పద్మజ, లక్ష్మి వదినదగ్గర కూర్చున్నారు. భద్రం అంగటిగదినుంచి వచ్చాడు తమ్ముడు తలదించాడు. పద్మజ, లక్ష్మి అక్కడనుంచి పెరటుకు వెళ్లిపోయారు.

"నీతో రేపు లక్ష్మిని తీసుకపో" అన్నాడు అన్నయ్య.

"అందుకేనా టెలిగ్రాం" అన్నాడు తమ్ముడు.

"హాఁ, అందుకే" అంటూ భద్రం వెళ్లిపోయాడు మామూళ్లు స్థలానికి. ఇంతవరకూ యీ టెలిగ్రాం విషయమై వినని ముగ్గురూ నిర్ఘాంతపోయారు.

అన్నపూర్ణ తేరుకొని చూసేసరికి పరిస్థితి విషమించినట్లుంది. బుచ్చిబాబు అంగటి గదిలోనికి వెళ్తే పరిస్థితి విషమిస్తుందని "కూర్చోండి బుచ్చీ" అంది. బుచ్చిబాబు కూర్చోలేదు. "సరే గానీ..." మాటలు యీ ఊత పదం తరవాత దొరకలేదు. పరిస్థితి అదుపులోనికి తేడానికి కొంత చలించింది. ఒకప్రక్కను వచ్చి కూర్చున్న పద్మజ కనిపించింది. ఇదివరలా ఆమె మొహంలో అట్టే యేవగింపు అగపడలేదు. ఇదివరకు చెప్పాలనుకున్న విషయం చెప్పితే పద్మజే కాదు—యింట్లో యెవరికీ తెలియని విషయం ఒకటుంది—భర్తకు అవసరంవస్తే చెప్తానన్న విషయం అదే-ఇంతకంటె మంచి సమయం లేదని శక్తిని కూడగట్టుకొని "చెల్లీ" అని అభిమానం వుట్టిపడే స్వరంతో పిలచింది. పద్మజ కొంత దగ్గరగా జరిగింది "ఈ యింటి కోడలివి కానీ యీ యింటి సంగతి యిన్నాళ్లూ నీతో చెప్పలేదు. వింటావా?"

పద్మజ మౌనంగా కోరికను వ్యక్తపరిచింది. మళ్ళీ నీరస కంఠంతో "కూర్చోండి బుచ్చీ! మీకూ తెలియని విషయా లున్నయ్—" ఏమనుకున్నాడో బుచ్చిబాబు కూర్చున్నాడు. ముఖం మాత్రం వదిన వేపు లేదు.

ఆ శాంత స్వరం అశాంతి యుతమైన విషయాన్ని చెప్పటానికి సాహసిస్తోంది.

"మామయ్యగారు ముక్కుకు సూటిగా పోయేవారట! అందువల్ల చాలామంది బంధువులకద్దు చెడ్డయ్యారు. ఆ కోపం అత్తయ్య కాబట్టి సహించ

గళిగారు. అత్తయ్యగారు గట్టివారు కారారు. పట్టున పదినెలలు ఆరోగ్యంగా వున్నారని లేదు. ఆవిడగారి క్రింద డాక్టర్లకి పోసేసరికే సరిపోయింది. గడించిం దేమీ లేదు. మీ బావగారి తర్వాతముగ్గురు పోయారు. బుచ్చి తరవాత యిద్దరు పోయారు. లక్ష్మి తరువాత లేక లేక మళ్ళీ అరుణ. ఈ చావులతోనే ఆవిడ మరింత నీరసించిపోయారు. మీ బావగారు బి. ఏ. పాసయ్యేసరికి అప్పటికి మూడునెలలై మామయ్యగారు దీర్ఘరోగంతో మంచం పట్టారు. కష్టాలన్నీ ఒక్కసారే కూడుకొస్తయ్. ఋణాలు తప్పించి యింట్లో మిగిలిం దేమీ లేదు. మీ బావగారికి అన గానే వుద్యోగం దొరికిపోతుందా?''

అన్నపూర్ణ ఆగింది. ఆమె అలసట జెందు తున్నట్టు గ్రహించిన పద్మజ మరికొస్త జరిగింది. శక్తి కూడగట్టుకొని—

"లోకంలో యెవరకు యెవరనుకుంటే మనం యెక్కడుంటాం చెల్లీ? ఒకరు కాకపోతే ఒకరైనా కనికరించేవాళ్లు వుండకపోరు. కానీ కష్టాలు చెప్పుకొని చెయ్యి చాపటానికి సిగ్గుతో చచ్చిపోయే వాళ్ల సంగతి యేం చెప్పను? ఇంట్లో పస్తు—యింటి యజమానికోసం మందులు కావాలి. డాక్టరు తొందర చేశాడు..."

అన్నపూర్ణ గొంతుక పట్టుకపోయింది. అందరి ముఖాలు ఆద్రుతితో ముందుకు వంగాయ్. ఆగదిలో వున్న ముగ్గురకు రవణమ్మ యేంచేసిందో తెలియదు కంఠం సవరించుకొని "అత్తయ్య యేం చేస్తారు? పసుపుకొమ్ము కట్టుకొని—పుస్తె పెద్దకొడుకు చేతిలో పెట్టారు—అంత పెద్దకొడుకు రాయిఅయి పోతే వెళ్లు నాయనా త్వరగా అంటూ త్రోసిం దావిడ. చెయ్యి వడుకుతుందేమో పుస్తె జారిపోయింది. మీబావ యేంచేస్తారు? వెళ్లారు గుండెపట్టుకొనే చేరారు. మందు తీసుకొని పరుగెత్తుకొని వస్తుంటే అంతదూరంలో వుండగా యేడుపు వినిపించిందట. నడిరోడ్డుమీద చేతిలోని సీసా జారిపోయింది—మెడలో మంగళసూత్రం మట్టిపాలైంది."

కళ్లకు కట్టినట్టు విషాదాంతమైన యీ దృశ్యాన్ని విషాదమైన స్వరంతో అన్నపూర్ణ చెప్ప టంతో ముఖాలన్నీ బరువెక్కి వంగిపోయాయి. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇంతలోనే గడియారం పదిగంటలుబదులు తప్పుగా యేడుగంటలు కొట్టడం యెవరూ గమనించినట్టు లేదు.

అన్నపూర్ణ పద్మజవేపు చూస్తూ.

"ఇక వీళ్లసంగతి—ఆయన చెప్పారు అప్పటి యింట్లో పరిస్థితిచూసి ఆయనకు యేనూతిలోనో పడి చచ్చిపోవాలనిపించే దట—అలాంటిదుఃఖంలో కూడా మీబావగారికి నచ్చచెప్పి కాలం వెళ్ళబుచ్చిం దావిడ. పరామర్శకు వచ్చిన వాళ్లు ఆ యేడుపులో సగం విని వెళ్లిపోతున్నారు. మిగతాసగం యేడుపు అర్థంచేసుకొనేవాళ్లెంతవారై యుండాలి? మా నాన్న చాలా దూరపుబంధువు. చూడటానికి వచ్చారు. నాన్న యింటికొచ్చాక అమ్మతో మాట్లాడుతుంటే విన్నాను. అమ్మను పంపించారు. బలవంతంచేసి మూడువంద లిచ్చారు. అత్తయ్య ఆకలితో చచ్చి పోయేబదులు యిలా బ్రతకాలనే ఆ డబ్బు పుచ్చు కున్నారట. మా మేనమామ అప్పుడు హుజూరుసిరస్తి దారుగా వుండేవారు. నాన్న మీబావగార్ని కష్టం మీద వుద్యోగంలో వెయ్యించాక మొదట యిచ్చిన డబ్బువిషయమై మరచిపోతున్నారు. కానీ అత్తయ్య మరచిపోలేదు. మానాన్నకు ఆవిడకోరిక కాదనటానికి మనసుపోలేదు. మాఅమ్మకు యిష్టం లేదు. మాఅమ్మతో అనటం విన్నాను—

"ఆ రవణమ్మలాంటి మనిషిని చూడలేదు. అటువంటి యిల్లు నిలిపితే నా కూతురు నాపేరు నిలబెట్టినట్టే—దానికోసం మన అన్నపూర్ణ బాధ పడినా నేను విచారించను''—ఇదే చెల్లీ యెప్పుడైనా జ్ఞాపకంవస్తే ఒళ్లు ఝల్లుమంటుంది. ఈ యింటి కోడల్ని. సంసారం యేమిటో— యెలా మసలాలో నాకేం తెలుసు? క్రొత్తగా ఒకసంవత్సరంవరకు అత్తయ్యవెంట త్రిప్పుకున్నా యే నుయ్యో గొయ్యో చూసుకోవాలని వుండేది— నేనేం చేసేది? అప్ప రసలా వుండాలంటే దేవు డివ్వని అందాన్ని యెక్కడ తేను? అత్తయ్య గురువైనా, దైవమైనా అంతా ఆమే. ఆవిడప్రయత్నంవల్ల కాలంతోపాటు ఆయన మనసు కూడ మారింది.''

వదిన తమతో యింతగా చెప్పని విషయాలను తోడికోడల నుద్దేశిస్తూ వెళ్ళగ్రక్కటంతో లక్ష్మి, బుచ్చిబాబు మనసు లోకవిధంగా తేలికైనయ్. పద్మజ తల దించుకొని వింటునేవుంది. అన్నపూర్ణ

వదనంలో హెచ్చుగా నీరసం అలముకుంటోంది. మాటాడటానికి కూడ కష్టపడిపోతోంది. అయినా చెప్పాలనుకున్నది చెప్పితీరాలన్న ఆతృతపట్టు దలవల్ల మెల్లగా గొంతు విప్పింది. ఈసారి భద్రం మాత్రం చెవులు బాగా రిక్కించాడు. తనకు యిది వరకు చెప్తా నన్న విషయం చెప్తుందేమో అని. "ఆవిడ కాలంచేసే ముందు నా పిల్లలు తల్లిలేదని యెప్పుడూ యేడవ రన్నారు—ఆ పిల్లలు మాఅమ్మ వుంటే యింత అన్యాయంచేస్తారా? అని యేడవ కండా వుండాలనే యింత ప్రయాసం చెల్లీ! ఆవిడ అంతకు ముందు ఒకవిషయం కూడా చెప్పారు. చెప్పవలసిన అవసరం వచ్చింది కాబట్టి చెప్తున్నాను- ఆవిడ అన్నారు. నాశరీరం దిట్టమైంది కాదాయె. ఏనిముషంలో కళ్లు మూస్తానో— అన్నదమ్ము లిద్దరూ సఖ్యంగా వుంటారని నాకేం నమ్మకం లేదు. మధ్యను నలిగిపోయేవాళ్లు ఆడపిల్ల లిద్దరూను వాళ్లు అత్తవారిళ్లకు వెళ్ళేవరకైనా సఖ్యంగా వున్నట్లు చూడమ్మా అన్నారు—ఈ అన్నదమ్ము లలా వుంటున్నారా? ఎడముఖాలు పెడముఖాలతో వాళ్ల బాగోగులు చూసుకుంటున్నారు గానీ తల్లిలేని పిల్లలు బావురమని యేడిస్తే వాళ్లకేం శ్రేయస్కరం కాదసైనా అనుకుంటున్నారా? ఏదీ లేదు. వాళ్ళ నోటి కొచ్చిన కూత కూస్తూ యిద్దర్నీ హతమార్చేస్తు న్నారు. అన్నయ్యలని మర్యాద యిస్తున్నారని వాళ్ల లేతమనసుల్లో చిచ్చు పోస్తారా? చెప్పండి బుచ్చీ చెప్పండి!"

చివరిమాట లన్నీ ఆవేశంతో రావడంవల్ల ఆమె మంచంమీదనుంచి లేచిపోయింది. ఆమె కళ్లు తిరిగాయ్. మళ్లీ మంచంమీదే వాలిపోయి మాటాడ టానికి కూడ శక్తి లేకపోయింది.

అందరూ అలా కొయ్యబారి పోయారు. నిస్త్రాణగా పరుపుమీద నుంచే పద్మజవేపు చూస్తోంది. ఎవరితలలూ మీదికి లేవలేదు.

మాట్లాడగలిగి మాట్లాడలేని వారి పరిస్థితిని కొంత వరకు మాటలురాని చిట్టి సరిచేశాడు. కీఁ మంటూ వుయ్యాలలో స్వరం హెచ్చించగానే అన్నపూర్ణ లేచి కొడుకును యెవరినీ కష్టపెట్టకండా తనే తీస్కొని అద్దాలలో వేసుకుంది అతి కష్టంమీద.

## ౧౧

తెల్లవారేసరికి పద్మజ కాఫీకాచి అన్నపూర్ణ యెదరగా పెట్టడంతో ఆమెకళ్లల్లో ఆనందబాష్పాలు నిండుకున్నయ్. రాత్రి యేమీ తీసుకోలేదని బలవంతం చేసి అన్నపూర్ణ త్రాగేటట్లు చేసింది.

ఏకాంతంగా లక్ష్మిని అడిగింది "ఇంట్లో యిలా కష్టపడేదా?" అని.

"బాగా నేర్పి తీసుకొచ్చాడేమో చిన్న న్నయ్య. అక్కడైనా యెంత ముద్దుచేసేవాడో అంతగా పనికూడా చెయ్యించేవాడు" అంది లక్ష్మి.

ఈ పరమసత్యాన్ని ఆమె చేష్టలే నిరూపిస్తు న్నాయని అన్నపూర్ణ అనుకుంది. బుచ్చి చేతకాని వారా అని భర్తను సూటిగా ప్రశ్నించినందుకు తగ్గట్టే భార్యను వంచారని సంతృప్తిపడింది. ఐనా పద్మజ పూర్తిగా మారిపోలేదు. విసుగుబాటు, అసూయ ఆమెను పూర్తిగా విడిచిపెట్టలేదు.

ఏడు దగ్గరైంది. అచ్యుతరామయ్యగారు భార్యతో సహా కలిసిరాకపోతే రాత్రంతా ఆలోచనలతో మనసులను నింపుకున్న వాళ్ళ ప్రవర్తనలో మార్పు కొంతలో కొంతైనా దృశ్యమయ్యేది.

సగంచచ్చి వచ్చిన సుబ్బమ్మ రాగానే కూతుర్ని చూసి నిండుజీవి అయ్యింది. అచ్యుత రామయ్యగారు అల్లుని వేపే చూడలేదు. బుచ్చి బాబు నమస్కరించటం, ఆయన అందుకొని కుశల ప్రశ్నలు వెయ్యటం జరిగింది. దంతధావన చేస్తూ వీధి అరుగుమీద బుచ్చిబాబుతో మాట్లాడారు. స్నానం పూర్తయాక కాస్సేపు కూతురుతో యేకాంతంగా మాట్లాడారు.

ఇంతకు పూర్వమే సుబ్బమ్మ జరిగిన తంతంతా కూతురుతో చెప్పకొచ్చింది. "ఆ మూలకి టెలిగ్రాం చేరేసరికి ఒకరోజు ఆలస్యం. రెండురోజులై యెడ తెరిపిలేకండా వర్షం పడుతోంది. పొలాల గట్లు దాటి రోడ్డు కొచ్చేసరికి బస్సులన్నీ తప్పిపో యాయ్. వేగంగా రమ్మని రెండుముక్కల్లో తెల్పాడు— నీ ఒంట్లో బాగులేదని మీనాన్న చెప్పారేమో సగం చచ్చానమ్మా— రంగడు ధైర్యం చెప్తూ నేవున్నాడు — అప్పటి కప్పుడు

బండి కట్టించుకొని స్టేషను కొచ్చేసరికి రైలు వెళ్ళిపోయింది. రాత్రిబండివరకూ వున్నాం. ఆ పాడుబండి నాలుగ్గంటలు లేటు — మీనాన్న ధైర్యం చెప్తూనే వున్నారు. కానీ ఏమిటో నమ్మా— కాలం చూస్తే మంచిది కాదు. అందులో యేముహుర్తాన యీవూర్లో అడుగుపెట్టావో యీనీరు నీవంటికి పడిందికాదు.''

ఇరువైపుల టెలిగ్రాంలు యిచ్చాక భద్రం ఆశించిం దొకటి. కానీ జరిగింది వేరొకటి. అటు తమ్ము డొక్కడే వస్తా డనుకున్నాడు. యిటు మామయ్యగా రొక్కరే వస్తా డనుకున్నాడు.

ధ్యానం అయ్యాక అచ్యుతరామయ్యగారు. బొజ్జ నిమురుకుంటూ అంగటి గదిలోనికి వచ్చారు. అల్లుడు కాఫీ త్రాగుతున్నాడు. మధ్యగుమ్మానికి చేరువుగా నిల్చొని పెరటివేపు చూస్తూ "అదేంటోయ్ బుచ్చీ! పిల్లిలా ఆ మూల కూర్చుని త్రాగుతున్నావ్''

"అచ్చే అచ్చే...''గొణుక్కుంటూ లేచి పోయాడు బుచ్చి.

"సరేగానీ—యిలా వస్తావటోయ్....''

బుచ్చి తనవేపు రావటం చూసి అల్లునివేపు తిరిగాడు. బుచ్చి గదిలోనికి వచ్చి ముఖం పెడగా త్రిప్పుకున్నాడు. ముసలాడు యిటూ అటూ పచారు చేస్తూ "ఏంవోయ్! టెలిగ్రాం యెందు కిచ్చినట్టు?'' సహజ గంభీర స్వరంతో అడిగాడు.

ఇదే సమయానికి అన్నపూర్ణ రెండో గదిలో గుమ్మందగ్గర చారబడి నిలుచుంది. ఎటువంటి బిడియం పడకుండా అల్లు డన్నాడు "దానికి యీ నీరు పడలేదు. కొన్నాళ్లు మీయింటికి తీసుకు వెళ్తారని''

"ఇలాంటి విషయాలు యిదివరకు టెలిగ్రాంల మీద నడవలేదే—'' కొంచం ఆగి "అదేనా సంశయం లే''

ఈ సంశయం తీరుతుం దనుకొనే మాటలు నమలటానికి అల్లుడు కొంత విరామం తీసుకోవలసి వచ్చింది.

"జ్వరం ముదరకూడదని—ఇక్కడ సరియైన సంరక్షణ లేదని—''ఈ సగం వాక్యాలు సరిగ్గా వుచ్చరించకపోవటంతో ఆయన చప్పున "ఇదివరకు ఆబాధ వుండేది. ఇప్పుడు లక్ష్మి వుందిగా'' అన్నాడు "అది యీ వేళో రేపో వెళ్లిపోతుంది''

"ఎక్కడికి?''

"బుచ్చి తీసుకువెళ్తున్నాడు''

"ఎందుకూ?''

ఈప్రశ్నల పరంపరలకు సమాధానం యిచ్చే ఆవశ్యకతగురించి భద్రం ఆలోచించాడేమో ఒళ్లు మండి జబా బీయలేదు.

అచ్యుతరామయ్యగారు బుచ్చిబాబు వేపు తిరిగి "ఏంవోయ్ బుచ్చీ—ఎందుకు తీసుకువెళ్తున్నావో చెప్పగలవా?'' అన్నాడు.

"నేను తీసుకవెళ్లటం లేదు''

"ఏం?''

"ఏమీలేదు. నాకిష్టం లేదు''

ఈమాటలు భద్రం సహనాన్ని ఛేదిస్తున్నయ్. మామ యెడగా నిల్చొని యిద్దరివేపు దృష్టిని పోనిస్తూ "మన నువ్వుల్లో నూనె లేకపోతే తెలకలివా ణ్ణంటే యేంలాభం? మీ బుర్ర లింతవరకే పనిచేశాయ్. చదువుకున్నారు. కొస్త మీ స్థితిగతులు ఆలోచించటానికి ప్రయత్నించండి''

ఆ పెద్దమనిషి మళ్లీ యిటూ అటూ తిరుగుతూ "సిగ్గూ ఒగ్గూ లేకుండా మసలటం మంచిపని కాదు. మధ్యను యేపాపం యెరగని ఆడపిల్లల్ని బయట వేస్తారటోయ్—మాకేం బరువని కాదు. కానీ ఆడపిల్లలు కన్నవారింట్లో గాదెక్రింద యెలకల్లా బ్రతుకుతామని భయపడుతుంటారు— బాగా ఆలోచించండి''

ఎవరూ నోరు పెగిలించకపోవటంతో ఆగి బొజ్జమీద చెయ్యి గిరగిర మెల్లగా త్రిప్పుతూ "నేను చెప్పాల్సివచ్చింది కాబట్టి చెప్తున్నాను. యోగ్యత గలవాళ్లని పాడవకముందే చెప్పటం నావిధి... నేననేది-అన్నదమ్ము లిద్దరూ యిలా కౌగలించుకోమని కాదు. కలత లెలా వచ్చినయో కలయికకూడా అంత కాలం పట్టుంది. ఇద్దరూ తాత లయ్యేవరకూ కలసి మెలసి వుండాలని కాదు. అలావుండా లన్నా వుండలేరు. మీ కుటుంబపరిస్థితులు తెలుసుకొని కాలం యెరిగినవా ళ్లేమంటా రంటే—ఆ ఆడపిల్లలు అత్తవారిళ్లకు వెళ్లేవరకైనా మీరు సఖ్యంగా వుండా లంటారు—చిన్నవాళ్లు కారు—ఆలోచించండి''

బుచ్చిబాబు వంచిన తల యెత్తలేదు–కానీ భద్రాన్ని యీ మాటలన్నీ రిమ్మెత్తిస్తున్నట్లు ముఖకళే చెప్తోంది. మధ్యను యిలా యీ ముసలాయన రావటం సుతరాం యిష్టం లేనట్లుగా చిరాకు పడుతున్నాడు. ఈ చిరాకుతో సంబంధం లేకుండానే ముసలాడు అన్నాడు "తగూలకి పెద్దకారణా లుండఖ్ఖర్లేదు. ఇదంతా యెందు కొచ్చిందో చెప్తావా ?"

భద్రం కోపం పట్టలేనంతయింది. ఇంతలో యెవరూ మాటాడకపోవటంతో అన్నపూర్ణ ముందు కొచ్చి నాందీప్రస్తావన చెయ్యబోయింది. భద్రం చప్పున లేచిపోయాడు. కళ్లు చింతనిప్పు లయ్యాయ్. భార్యమీద కోపం యింకోవిధంగా చూపించటానికి లాభంలేక యిల్లు కదులుతుంటే "ఆగవోయ్! మనిషికి యీగూ, గెలుపూ రెండూ వుండా" లన్నాడు మాఘు.

ఈ మాటలు వినకుండా అల్లుడు రొప్పుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. ఇల్లంతా మౌనంతో నిండిపోయింది. చాలసేపటికి అచ్యుతరామయ్యగారు అక్కడే నిల్చున్న కూతురువేపు తిరిగి "ఇలాంటి దొమ్మరివాళ్ళ సంబంధం చేసుకోమంటావమ్మా—అప్పుడు గడ్డితిన్నాను. ఇప్పుడూనా? నేను వెళ్తున్నాను." యిలా అంటూనే ప్టాండుకున్న ఖద్దరు పంచె తీశారు. ప్రయాణం అయ్యేవరకు నోరెత్తడానికి యెవరికీ ధైర్యం చాలిందికాదు. ఆయన కోపం అంతే. మళ్ళీ ఆయనే వస్తారని అన్నపూర్ణ యీసారి చెప్పలేకపోయింది.

వెళ్ళిపోయేముందు అక్కడే నిల్చున్న బుచ్చిబాబుతో "మా రంగడికి మీయింటి సంబంధం చేస్తామనుకున్నాను. కానీ యిప్పుడు ఆలోచించవలసి వస్తోంది—చూడూ మనిషిజన్మ యెత్తాక కష్టాలు అనుభవించాలా? ఆ కష్టాలలో యేమూలనుంచో కాసింత అభిమానం లేకపోతే తేరుకొని సుఖపడలేం—అన్నదమ్ము లిద్దరిలోనూ ఆ పిల్లమీద యేకోశాన అభిమానం లేనప్పుడు నే నెలా చేసుకుంటాను?"

ఈ చివరివాక్యంతో యేకీభవించని బుచ్చి కాస్త ముక్కు నులుపుకున్నాడు. గుమ్మం దాటుతూ వెనుకకు తలత్రిప్పి "నే నొకటి చెప్పటంవల్ల నీకు కోపం రాదనుకుంటాను" అన్నాడు.

అందరూ చెవులు రిక్కించారు. తలయెత్తిన బుచ్చిబాబువేపు ఒకసారిచూసి చేతులాడిస్తూ "నీకొక విషయం చెప్తున్నాను. ఎద్దు తంతుందని గాడిదకాళ్ళ దగ్గర కూర్చోవద్దంటున్నాను. ఇంటిపరువు నిలబెట్టాలంటే ఆ యెద్దునే మచ్చిక చెయ్యవోయ్—నా కోపం యేంలేదు నే నెందుకు బాధపడా లంటావేమో? సరి ఆయ నుంటే యిదంతా యెందుకు? నీకు చేసిన మేలు బట్టి మీ వదినముఖం చూసైనా నీ పౌరుషం చంపుకోవాలి—నా జోక్యం అనవసరం అని మీ అన్నయ్య స్పష్టపరిచాడుగా—ఒకరు కలిపేకంటే మీకై మీరే కలుసుకుంటే మంచిది—అంచేత చెప్పాను–సరా!"

ముసలాడు చంకను గొడుగు సర్దుకుని ముందుకు సాగిపోబోతూ వెనుతిరిగి కూతురుముఖం వేపు చూశాడు. కొంచం తటపటాయించినా మళ్లీ ముందుకే సాగాడు. ఆయనకనిపించేవరకు చూసి ఆమాటలతో లోలోన త్రుళ్లిపడుతున్న బుచ్చిబాబు కుర్చీలో కూర్చుండిపోయాడు.

అన్నపూర్ణ చిట్టిని వుయ్యాలలో వేసి వూపుతోంది. సుబ్బమ్మ యేదో పెరట గొణుక్కుంటోంది. లక్ష్మి పద్మజ వంటయింటిలో వున్నారు.

బుచ్చిబాబు లేచాడు. ఇటూఅటూ గదిలోనే కంగారుగా పచారు చేశాడు. వదిన ముఖం గంభీరంగా వుండటం గమనించకపోలేదు.

అనుకోనట్లుగా అన్నపూర్ణ అంగటిగదిలోనికి వచ్చింది. గంభీరంగా వున్నా నీరసం స్పష్టంగా కనిపిస్తూనే వున్నది. కిటికీలోనుంచి వీధిలోనికి చూస్తోంది. కొంతసే పయాక "ఇంకా కోపం చల్లారలేదేమో" అంది.

వదిన ఈమాటలు ఒకవిధంగా తనమీదే ప్రయోగించిందని బుచ్చి కొంచం తొట్రుపాటు పడ్డాడు.

"క్లబ్బులో పేకాట ఒకటి క్రొత్తగా నేర్చారేమో— యింటిమీదెందు కుంటుంది ?"

అలా గజాలు పట్టుకొనే చాలసేపటి వరకూ నిల్చుంది. బుచ్చిబాబు వదినకళ్లల్లోనుంచి నీరు జారటం గుర్తించాడు. ఏమనటానికి తోచలేదు. కన్నీరు మెల్లమెల్లగా తుడుచుకుంటూ హీనమైన స్వరంతో "ఇన్నాళ్లూ ఒకఆశ పెట్టుకున్నాను—లక్ష్మిపెళ్లి చూసేవరకైనా బ్రతికుంటానని—ఆ ఆశ యీ వేళతో సరి"

ఈమాటలు బుచ్చిబాబు నిజానికి వినలేకపోయాడు. వదిన మళ్లీ మరింత హృదయం కదిపేటట్లు అన్నది— "నిజం చెప్తున్నానండి బుచ్చి—నాబంట్లో యేమీ బాగా లేదు. నిద్ర పోదామన్నా నిద్దర రావటం లేదు. ఏం జబ్బో యేమిటో నాకేం తెలియటం లేదు.''

బుచ్చిబాబు గబ్బున లేచి వదినదగ్గరగా వెళ్దామనుకొనేసరికి సుబ్బమ్మ రావటంతో మళ్లీ కూర్చుండి పోయాడు.

సుబ్బమ్మ వస్తూనే "నాబిడ్డడి లాంటి వాడివి. నన్ను కాస్త గుండె దిట్టం చేసుకొని బతకనియ్-ఏమడిగినా అమ్మాయి చెప్పదు. ఇంకొకర్ని చెప్పనివ్వదు—ఇదంతా యేమిటో..." అంటూనే బుచ్చిబాబుకు చేరువలో కూర్చుంది.

బుచ్చిబాబు తలెత్తలేదు. బహుశః తనలో రేగిన శోకమయమైన వుద్రేకాన్ని అణచుకోవటంలో నిమగ్నుడైఉన్నాడు.

"అమ్మాయిని చూస్తుంటే మాకేమిటో భయం వేస్తోంది. పోనీ యేడాక్టరుకు చూపిద్దామన్నా ఫలానా జబ్బని చూపిస్తామా? ఏదో ఆ అల్లుడికి ఆవిశాఖపట్నమే బదిలీ చెయ్యించాలని అనుకుంటే ఆయనగారి రాకట అలా వుంది. ఘూమ్ ధామ్ అంటూ మీ మామయ్యగారు వెళ్లిపోయారా? నేను వెళ్లి యీ విషయ మేమైనా కదిపానా అంటే నన్ను బ్రతనివ్వరు."

బుచ్చిబాబు ఒకసారి వదినవేపు చూశాడు. ఆమెకూడా తనపరిస్థితిలోనే వున్నట్లు గుర్తించాడు.

"ఆ మధ్య ను మాఅన్నయ్యకొడుకు పెళ్లాం మాటలువిని వేరుపడ్డాడు. తండ్రికొడుకులను కలపాలని మీమామయ్యగారెంతో హైరానుపడ్డారు. ఆడవాళ్లకు మోజు లెక్కువ నగలు నాణా లంటే ప్రాణం పెట్టారు. మాఅన్నయ్య కోడలివంటిమీద బంగారం తిన్నాడు కదా వాడినేమీ అనకుండా కోడలి నంటే యేంలాభం? నేరం నిష్ఠూరాలు పడ్డానికి దాని వయస్సెంత? మనం యివన్నీ మాడాలా మరి? ఈమాటలన్నానని మీ మామయ్యగారు కొట్టినంత చేశారు. ఆయన తంతే అంత—నీవేమీ అనుకోకు బుచ్చి—"

బుచ్చిబాబు ఒకవిధంగా యిటువంటి ప్రసంగం రావటంతో నిర్విణ్ణుడైపోయాడు.

"నేను పెద్దదాన్ని—ఆమాత్రం చెప్తాను. మనసులో చెడ్డ పెట్టుకుంటే మహాపాపం అంటారు. మంచిచెడ్డలు మూగనోము పట్టే తేలిపోతయ్యా?"

సుబ్బమ్మ హితబోధ చేస్తుంటే బుచ్చిబాబు గొంతుక సవరించుకున్నాడు. ఏవిషయంలో కాకపోయినా ఒకవిషయంలోని నిజానిజాలు బయటపెట్టాలనే వుబలాట పడుతున్నాడు—లక్ష్మిని తనెందుకు హఠాత్తుగా విడిచిపెట్టాడో చెప్పెయ్యవలసివుంది.

సుబ్బమ్మ మళ్లీ శాంతంగా అన్నది. "చిన్నప్పటి నుంచీ చూస్తున్నావ్. మాకంటే మీఅన్నయ్యసంగతి నీకే బాగా తెలియాలి. మా పెదతండ్రికొడుకుండే వాడే—యిలాగే యింట్లో యెవరైనా యెదు రాడినా యింటితగువుల్లో దగ్గరవాళ్లు మధ్యకొచ్చినా హంగామా చేసిపారేసేవాడు— అది వాళ్ల నైజగుణం పుట్టుకతో వచ్చింది మధ్యను పోతుందా— చూడు నీమీద అభిమానం లేకపోతే వుత్తరాలెందుకు వ్రాస్తాడు? టెలిగ్రాం యెందు కిస్తాడు?''

రెండోగదిలో చాటున వింటున్న లక్ష్మి తన బతుకు ముసలిది బయటపెట్టిందని గతుక్కుమంది. తను మాటాడటానికి ఒక విధమైన వాతావరణాన్ని సుబ్బమ్మ సృష్టించటంతో బుచ్చిబాబు వెంటనే అన్నాడు.

"మీతో అంతా చెప్తే చాల భారతం అవుతుందండి. తప్పు లన్నిటికి తల వంచాక యిప్పుడేం అనుకుంటే యేం లాభం?"

"ఒకరి తప్పు లింకొకరు సర్దుకోకపోతే కుటుంబం యెలా నిలుస్తుంది. బుచ్చీ మనలాంటి కుటుంబాలు గుమ్మటంగా బ్రతకాలి గానీ యిలాంటి తగూల్తో బయటపడ్తామా?"

"బయటపడింది అన్నయ్యా కానీ నేనుకాదు - ఏమండీ వదినా!"

వదిన ఒక్కసారి తలయెత్తింది. యే మాటా అనలేదు. సుబ్బమ్మ సౌజన్యస్వరంతో మళ్ళీ మొదటకు వచ్చింది—"ఈ యెడమొఖాలకీ పెడమొఖాలకీ కారణ మేమిటి?"

"ఏవుందండీ! అణిగివున్నవాళ్ళని మరింత అణిచేయటం!"

అన్నపూర్ణ గతుక్కుమంది. కాని బాగా లోకాన్ని చూసిన సుబ్బమ్మ నవ్వి "మీ మామయ్యగారు కోపంతో యేమైనాఅంటే చచ్చినట్లు నోరుమూసుకుంటాం. ఆర్చేవాళ్లు, తీర్చేవాళ్లు కాబట్టి యేమైనా అంటారు — అలాగని వాళ్లకి అభిమానం లేదనగలమా? దీనికంత మాట పట్టింపులా బుచ్చీ?

"అవునండీ! దొంగను దొంగంటే బావుంది కానీ."

"తరవాత మెల్లగా నేను దొంగను కానని చెప్పితే వూరకనే అన్నవాళ్లు సిగ్గుపడ్తారు."

"అన్నయ్య దగ్గర కక్కలేన"న్నాడు చిరాకుగా.

సుబ్బమ్మ మందహాసం చేస్తూ "ఎంతైనా ఒకపేగు— అభిమానా లెటుపోతయ్— పోనీ అన్నయ్యదగ్గర భయమైతే—"వాక్యం సగంలో ఆపేసి కూతురువేపు చూసింది.

పైకి చప్పున వచ్చిన మాటలు మళ్లీ ప్రతిధ్వనించటం వల్ల సిగ్గుపడ్డాడు. ఈ సిగ్గును కప్పిపుచ్చటానికి గంభీరంగా గంభీరమైనవిషయం చెప్పాడు.

ఈ విషయం విని అందరూ బిక్కమొగాలు వేశారు. వేగంగా మాటాడటానికి యెవరినోరూ పెగిలింది కాదు. అన్నపూర్ణ ప్రయత్నంమీద "ఇది నిజమా, ఇలా యెవరన్నారు" అంటూ ప్రశ్నించింది.

"ముమ్మాటికి నిజం. ఇదంతా యెందుకండి వదినా? మా మామయ్య తహశీల్దారు అయితే కావచ్చు. నేను తహశీల్దారుని కాదుగా— నేను మామగారితో చెప్పి యీ మూలకు బదిలీ చెయ్యించానని వూళ్లో కొందరితో చెప్పాడు అన్నయ్య. మీరంతా ఇక్కడికి వచ్చాక నెలపోయాక ఆ గోపాలకృష్ణమూర్తి గారు నన్ను నిలదీసి నలుగురిలో అడిగాడు— నేను చచ్చినట్లు వదినా— నేను బదిలీ చెయ్యిస్తే"

సుబ్బమ్మ గప్పున కలుగజేసుకుంది "కిట్టని వాళ్లు చిలవలు పలవలు చేసి..." సుబ్బమ్మమాటలకు హఠాత్తుగా అడ్డొచ్చి "గోపాలకృష్ణమూర్తి అన్నయ్యమీద కిట్టని కబుర్లు చెప్తాడా?"

"ఏమో బుచ్చీ మన దినాలు బాగులేకపోతే ధర్మమే పాపమై కనుస్తుంది."

"హుఁ... మీకు తెలియదండీ వాళ్లిద్దరి కెంత స్నేహమో! ఇందులో యేం దాపరికం లేదు. ఏ కోపం లేకపోతే అలాంటి వుత్తరా లెందుకు వ్రాస్తాడు— నేను అత్తవారింటికి గులాంనై పోయానట! వుత్తరాలుచూసి ఆ గోపాలకృష్ణమూర్తే యేమన్నాడు? పౌరుషం అంటూ వుంటే జవాబే వ్రాయొద్దన్నాడు"

తను చూడని వుత్తరాలు కూడా వున్నయ్యని లక్ష్మి నివ్వెరపోయింది.

"తప్పు చెప్పకుండా యిలా గూఢార్థాలతో గుమ్మరిస్తే యెలా వుంటుంది? క్రొత్త సంసారమా? ఇంచుమించు సామానులన్నీ యిక్కడకే మోసుకొచ్చాడు—డబ్బు రొక్కటంతో తల పగిలిపోయేది,—ఏలా వుంటుందండీ—పోనీ అంతటితో చాలించాడా? ఆ యిద్దరి ఆడపిల్లల పెళ్ళి యెలా చేస్తాడో చూస్తానని చాటుకొచ్చాడు. వాళ్ళిద్దర్నీ అక్కడ అందుకోసమేనా వదిలివచ్చాడు."

మిగతవా రెవరూ మాటాడటానికి సాహసించలేదు.

"నాకు పౌరుషం వుంది. అంత పౌరుషం వున్నవాడివి లక్ష్మిని యెందుకు దిగబెట్టావని అడగ్గలరు? అక్కడున్న పరిస్థితులుబట్టి లక్ష్మిని రెండు నెలల్రకితం నుంచీ యిక్కడ విడిచివెళ్దామనేవుంది. వదిననొక్కసారి చూడాలని మనసు పుట్టింది. అదీ కాకుండా యిల్లు మార్చేముందు గోపాలకృష్ణమూర్తి గారు శెలవు లొచ్చాయి కదా ఒకసారి లక్ష్మిని పంపించటం వుత్తమమని చెప్పారు. ఆలోచించాను— ఇల్లు మార్చామా? ఆ కోతి అక్కడ మరీ గెంతుతోంది—"

అన్నపూర్ణ పూర్తిగా చివరివాక్యం అర్థం చేసుకోలేదు; సుబ్బమ్మకు అయోమయంగా వుంది. ప్రక్కగదిలో చాటున నిల్చున్న లక్ష్మి తల తిరిగిపోయి గప్పున కూర్చుండిపోయింది. కొంతసేపటికి గాని ఆమె యిట జరుగుతున్న సంభాషణ వినలేకపోయింది. పద్మజ పాపతో పెరట వంటయింటిలో వుంది. లేదా అంటే ఆమె అన్నయ్యను కోతిని చేసినందుకు యెంత గొడవచేసేదో!

"అన్నయ్య బదిలీ గురించి కనుక్కోగా చివరకు బయటపడిం దేమిటంటే మామయ్యగారు చెయ్యించారు."

అందరి నోటివెంబడి 'హా' అనే ఆశ్చర్యార్థకం వచ్చింది.

"మన గొప్పను వాళ్లేం అర్థం చేసుకున్నారు? అలాంటివాళ్ళని మనం ఎందుకు గౌరవించాలి? వాళ్లేం యిచ్చినా వద్దనలేదు—కూతురు ఒళ్లు బంగారంతో నింపినా చివరకు మంచిదే అన్నాను—మా లక్ష్మి వుందని—నా తప్పంటే చెప్పండి అత్తయ్యగారూ?"

అసలు తప్పు అబద్ధమని చెప్పటానికి ఆమె సంకోచించిందేమో! కాని అన్నపూర్ణ లక్ష్మితో అవసర మనేది యెంతపనైనా చెయ్యిస్తుందన్న మాటలను వూహించుకోనే వుంటుంది!!

సుబ్బమ్మ సహజ శాంతస్వరంతో "తప్పెందుకుంటే యేం లాభం బుచ్చీ? అమ్మాయైనా నేనైనా అన్నీ మరచిపొమ్మని కోరతాం గానీ—"

బుచ్చిబాబు వదినవేపు చూశాడు, దీక్షగా కొంతసేపు చూశాడు. "మీ రెప్పుడూ యిలానే సర్దుకోస్తారండి వదినా'' అని తనలో తనే అనుకున్నట్లు భ్రమపడ్డాడు. ఆమె యెందుకు సర్దుకోస్తుందో, యెందుకు మౌనం దాలుస్తుందో, యెందుకు హాస్యమాడుతుందో, యెందుకు కోపంగా వున్నట్లు సంచరిస్తుందో అంతా ఆయనకు తెలుసు. యీ అయిదు నెలలకి అలాంటి అనుభూతు లన్నీ ఒక్కసారి శరీరమంతటా ప్రాకిపోయినయ్. కళ్లల్లో నీరు అలముకోవటం, చేతులు కంపించటం జరక్కుండా అక్కడనించి లేచి వీధిలోనికి వెళ్లాడు. క్లబ్బుకు పోయేరోడ్డు పట్టాడు.

ముందు కెండలో అన్నదమ్ములిద్దరూ కలసి రావటం నిరీక్షిస్తున్న వాళ్లకళ్లు మిరిమిట్లు గొలిపాయ్. సుబ్బమ్మ గబగబ పెరటకు వెళ్లి "యేమిటమ్మా యింకా వంట కాలేదూ?'' అంది. పద్మజ "అయిపోవచ్చిం దండి.''

బుచ్చిబాబు గదిలో కాలుపెట్టూనే "మూటాముల్లే కట్టండి వదినా— రేపే ప్రయాణం''-అన్నపూర్ణ, మరది యెలా సాధించగలిగా రని ఆలోచించక పోలేదు.

కమీజు విప్పుతూ "అన్నయ్య వారంపది రోజులు హోటల్లో, బాధపడతారు. రెండు నెలలు శలవుపెట్టున్నారు. అక్కడకు బదిలీ కోసం ప్రయత్నిద్దాం''-బుచ్చిబాబు గొంతుకపూర్తి లోంగుబాటును సూచించటంవల్ల మరది దాసోహం అని భర్తను తీసుకువచ్చారని అనుకుంది.

అన్నపూర్ణ వడ్డించింది భోంచేస్తూ "పప్పులో వుప్పు హెచ్చుపోశారే'' అన్నాడు బుచ్చిబాబు పిల్లిలా భోంచేస్తున్నాడు భద్రం. సుబ్బమ్మ అందుకుంది "వేగంగా జీర్ణాని కొస్తుందిలే బుచ్చీ! కావాలని చేసిందేమో పద్మజ!!"

"మహ ఘటికురాలు!" ఈసారి అన్నయ్య బదులు తమ్ముడే ఒకఆశతో అన్నాడు. దానికి తగ్గట్టుగానే అన్నపూర్ణ "మా చెల్లెలు మీ మొఖాసాలేం దోచుకపోదు లెండి?''

బుచ్చిబాబు యీసారి అన్నయ్య మాట్లాడుతాడని ఆశించటంచేత మౌనాన్ని దాల్చాడు. ఇంతలో ఒక గంభీరమైన గొంతుక వినిపించింది— "ఆః మనకోసం మనం బ్రతకాలటండీ? లోకంలో అందరికోసం కాకపోయినా కొందరికోసమైనా బ్రతకాలి— ఎలాగో ఆయింటిని నిలబెట్టారు.''

అందరూ నిశ్శబ్దంగా విన్నారు. అన్నపూర్ణ గబగబ అంగటిగదిలోనికి వెళ్ళింది. అచ్యుతరామయ్యగారు యింకో ముసలాణ్ణి కుర్చీమీద కూర్చోబెట్టున్నారు. "నాన్నా'' అంటూ మహదానందమూ తృప్తితో దగ్గరకు రాగానే "మా అమ్మాయండి. ఇదిగో అమ్మా సుంకరణం వెంకటప్పయ్య గారు. మనకి దగ్గరవాళ్లే— యిన్నాళ్లూ యీ వూరిలోనే వున్నారు. మాకే లేకపోయాను.''

అన్నపూర్ణ చేతులు జోడించింది. వృద్ధుడు దీవించాడు. భోంచేస్తున్న వాళ్లని, దగ్గరగావున్న వాళ్ల నందరినీ చూసి వృద్ధుడు వెళ్లిపోయాడు. అచ్యుతరామయ్యగారు మెల్లగా పెరటికి వస్తూ "మళ్లీ దిగపడ్డాను. యెవరికీ కోపం రాదు కదా?''

కోపం చప్పున పాపకు వచ్చింది. లల్లలల్లలా అని వెక్కిరించింది.

"షోవే!'' అంటూ ముందు కొచ్చాడు ముసలాడు. ఆడుకుంటున్న చిట్టి, దొండపండు తాతమీద విసిరాడు. "ఏమోయ్! నీకూ నామీద కోపమే'' అంటూ కుర్రాణ్ణి యెత్తుకొని మనమరాలితో హాస్యానికి దిగాడు.

ఇల్లంతా పకపక ప్రతిధ్వనిస్తోంది. అన్నదమ్ములిద్దరూ ముఖాలు చూసుకొని నవ్వుకోవటం తలుపుదగ్గర నిల్చొని ప్రశాంతంగా చూస్తున్న అన్నపూర్ణ కళ్లు ఆనందబాష్పాలతో నిండిపోయాయ్. పెదాలు కంపించినా మాటాడలేకపోయింది. నోరు నిండుగా యేదో అమృతం వూరుతున్నట్లయింది. అక్కడనుంచి మెల్లగా అంగటిగదిలోనికి జారిపోయి చేతిలో చేయిపట్టి అణచిపట్టుకొని గట్టిగా నవ్వుకుంది.

"చూడమ్మా! నీ కూతురు చెవులు పట్టుక ఆడిస్తోంది'' అని ముసలాడు దగ్గరకు రాగానే కూతుర్ని తీసుకొని ముద్దులాడి మురిసిపోతోంటే ముసలాడు బొజ్జమీద చెయ్యి గిరగిర త్రిప్పుకున్నాడు.